విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

శుక్రవారం 10 అక్టోబరు 2025 8 పేజీలు

మత్స్యకారుల సమస్యలు మూడు నెలల్లో పరిష్కరిస్తాం

ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ హామీ

విశాలాంధ్ర బ్యూరో - కాకినాడ : మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్ర పరిశీలన జరిపి మూడు నెలల్లో పరిష్కరిస్తామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారు. గురువారం కలెక్టరేట్ వివేకానంద సమావేశ హాలులో ఆయన ఉప్పాడ మత్స్యకార సోదరులతో మాట-మంతి నిర్వహించి మత్స్యకార గ్రామాల పెద్దలు, యువత, మహిళలు, స్వచ్ఛందసంస్థల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో బాటు కాకినాడ ఎంపీ తంగేళ్ల ▶మిగతా 2లో..

రైతుల ఆవేదన ప్రభుత్వానికి పట్టదా?

- 8 ఏళ్ళైనా అందని పరిహారం
- పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం నిర్వాసితులకు తప్పని ఇక్కట్లు
- ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ నెరవేరేనా

విశాలాంధ్ర - సీతానగరం : తమ ప్రాంతవాసులకు మంచి జరిగితే తమకు మంచే జరుగుతుందన్న సదుద్దేశ్యంతో ఏపీ ప్రభుత్వానికి విలువైన తమ భూములు ఇచ్చి, అటు ప్రభుత్వం నుండి నష్టపరిహారం అందక, ఇటు మిగిలిన భూములు క్రయ విక్రయాలు జరగక కొంతమంది రైతులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. తమ ఆవేదన అటు ప్రభుత్వానికి ఇటు అధికారులకు కనిపించ దండం లేదంటూ పలువురు రైతులు తమ దీన గాధను విశాలాంధ్రతో పంచుకున్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గం, సీతానగరం మండలంలోని పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం నిర్మాణం కోసం స్థానిక రైతుల వద్ద నుండి తీసుకున్న భూములకు ఎనిమిది ఏళ్ళు గడుస్తున్నప్పటికీ అనేక మంది రైతులకు ప్రభుత్వం ఇప్పటివరకు నష్టపరిహారం చెల్లించలేదు. గోదావరి ప్రాంత వాసుల చిరకాల కోర్కికైన పోలవరం ప్రాజెక్టు నిర్మాణం జాప్యం జరుగు తుందనే ఉద్దేశ్యంతో 2014-19లో అధికారం చేపట్టిన అప్పటి టీడీపీ ప్రభుత్వం మండలంలోని పురుషోత్తపట్నం గ్రామ పంచాయతీ పరిధిలో పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం నిర్మాణం చేపట్టారు. దీనిలో భాగంగా వరదల సమయంలో వృథాగా పోతున్న గోదావరి జలాలను సద్వినియోగం చేసుకోవాలని భావించి, గోదావరి వరద జలాలను విశాఖపట్నం త్రాగునీటితో పాటు అక్కడే ఉన్న స్టీల్‌ప్లాంట్ నీటి అవసరాలకు తరలించేం దుకు శ్రీకారం చుట్టారు. అందుకు అవసరమైన భూ సమీకరణలో భాగంగా సమీప నాలుగు గ్రామాలలో సుమారు 304 మంది సన్న,చిన్నకారు రైతుల నుండి దాదాపు 259 ఎకరాల భూమిని సేకరించారు.రైతుల వద్ద నుండి ఎకరాకు 28 లక్షల రూపాయలు నష్ట పరిహారం చెల్లించి భూ సేకరణ చేసి ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేశారు. ఈ భూ సేకరణలో 72 ఎకరాలకు చెందిన 93 మంది చిన్న రైతులు తమకు అన్యాయం జరిగిందని, తమకు మరికొంత పరిహారం పెంచి చెల్లించాలని కోరుతూ ▶మిగతా 2లో..

బాణాసంచా తయారీ యూనిట్ల తనిఖీ

కలెక్టర్ మహేష్ కుమార్

విశాలాంధ్ర - అమలాపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఉన్న బాణాసంచా తయారీ యూనిట్లు, హోల్ సేల్ విక్రయ కేంద్రాలకు లైసెన్సుల అనుమతులు, భద్రత, రక్షణ ప్రమాణాల అంశాలలో మూడు రోజులపాటు పర్యవేక్షణ బృందాలు వెళ్లి తనిఖీ చేసి నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, ఆర్డీవోలు, డీఎస్పీలు, తహసీల్దార్లు, అగ్ని మాపక విపత్తుల స్పందన అధికారులు, లేబర్ డిపార్ట్మెంట్ అధికారులతో బృందాలు ఏర్పాటు చేసి బాణాసంచా తయారీ యూనిట్లు, హోల్ సేల్ దుకాణాలను సందర్శించి భద్రత రక్షణ అనుమతులు గుర్తింపు పొందిన కార్మికులు పనిచేస్తున్నది లేనిది పరిశీలన చేయాలని ఆదేశించారు. బుధవారం జిల్లాలో జరిగిన అవాంఛనీయ సంఘటనలు పునరావృతం కాకుండా నేటి నుండి మూడు రోజులపాటు తనిఖీలు నిమిత్తం తయారీ యూనిట్లను హోల్ సేల్ వ్యాపారాలను నిలుపుదల చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా బాణాసంచా తయారీ యూనిట్లు 18 వరకు ఉన్నాయని, హోల్సేల్ డీలర్లు 19 మంది వరకు ఉన్నారని ఆయన తెలిపారు. జిల్లా ఫైర్ ఆఫీసర్ నోడల్ అధికారిగా వ్యవ హరిస్తారని వీరి ఆధ్వర్యంలో నియమింపబడ్డ తనిఖీ బృందాలు ▶మిగతా 2లో..

భద్రతా ప్రమాణాలు తప్పనిసరి

- కలెక్టర్ కీర్తి చేకూరి
- బాణాసంచా తయారీ కేంద్రాలపై సమీక్ష

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : జిల్లాలోని బాణాసంచా తయారీ, నిల్వ, విక్రయ కేంద్రాలలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని, అనుమతులు ఇచ్చే నేపథ్యంలో మార్గదర్శకాలు ఖచ్చితంగా పాటించాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు. గురువారం బొమ్మూరు కలెక్టరేట్ సమావేశ మందిరంలో బాణాసంచా తయారీదారుల సంఘాల ప్రతినిధులు, సమన్వయ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం అన్ని బాణసంచా తయారీ, నిల్వ కేంద్రాల వద్ద భద్రతా ప్రమాణాలను తప్పని సరిగా పాటించాలని స్పష్టం చేశారు. అనుమతులు జారీ చేసిన వాటికి సంబంధించి క్షేత్ర స్థాయిలో సమన్వయ శాఖల అధికారులు వ్యక్తిగతంగా పరిశీలన చేయాలని, తదుపరి మాత్రమే అనుమతులు ఇవ్వాలని ఆదేశించారు. అనుమతులు లేకుండా బాణాసంచా తయారీ కేంద్రాలు నిర్వహిస్తే కఠినమైన, చట్టపరమైన చర్యలు, క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు. బాణాసంచా తయారీ పనిలో పాల్గొనే కార్మికులు ఒకరికొకరు భౌతికదూరం తప్పని సరిగా పాటించాలన్నారు. దీపావళి ▶మిగతా 2లో..

విప్లవభావాలకు చిహ్నం చేగువేరా

సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

విశాలాంధ్ర-తణుకు: ప్రపంచ సోషలిస్టు విప్లవ భావాల సంస్కృతికి చిహ్నం చేగువేరా అని సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. సోషలిస్టు విప్లవ కారుడు చేగువేరా 58వ వర్ధంతి సందర్భంగా గురువారం తణుకు సీపీఐ కార్యాలయంలో చేగువేరా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పెట్టుబడిదారీ సమాజంలో దోపిడీ ఆర్థిక అసమానతలకు వ్యతిరేకంగా ఆకలి, పేదరికం లేని సమసమాజ స్థాపనకు చేగువేరా చిన్న వయస్సులోనే సోషలిస్టు విప్లవ కారుడుగా మారాడన్నారు. క్యూబాలో కాస్ట్రోతో సోషలిజం స్థాపనకు గెరిల్లా పద్ధతుల్లో ఉద్యమించి విజయం సాధించారన్నారు.చేగువేరా దక్షిణ అమెరికా అంతా మోటార్ సైకిల్ యాత్ర చేసి ప్రజలెదుర్కొంటున్న పేదరికం చూసి చలించిపోయాడన్నారు. ఆర్థిక తారతమ్యాలు, ఏకస్వామ్య పెట్టుబడిదారీ వ్యవస్థ, నూతన వలసవాదం సామ్రాజ్య వాద ఫలితమేనని తుది నిర్ణయానికి ▶మిగతా 4లో..

మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యం

పోరుమామిళ్ల సుబ్బారాయుడు

విశాలాంధ్ర-ఏలూరు: మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యం అని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బారాయుడు పిలుపునిచ్చారు. గురువారం సీపీఐ ఏలూరు జిల్లా కార్యాలయంలోని స్ఫూర్తి భవన్‌లో రాష్ట్ర ఆఫీస్ బేరర్స్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శుల సమావేశం యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు అసుల రంగనాయకులు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పోరుమామిళ్ల సుబ్బారాయుడు మాట్లాడుతూ పురపాలక మంత్రి నారాయణకు కార్మికుల సమస్యలపై, పరిపాలనపై అవగాహనే లేదన్నారు.రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల కొరత తీవ్రంగా ఉందని ప్రతి ఏటా మరణించిన,రిటైర్డ్ కార్మికుల స్థానంలో ఆయా కార్మిక కుటుంబ సభ్యులకు తిరిగి పనులు కల్పించే అనవాయితీ పూర్వం నుంచి గత జగన్ ప్రభుత్వం వరకు పోరాడి సాధించుకున్నామన్నారు. 12వ పిఆర్సి కమిటీ గడువు ముగుస్తున్న ఇంతవరకు ఐ. ఆర్.,ప్రకటించే శక్తి కూటమి ప్రభుత్వంకు లేకుండా పోయిందన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎస్. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్ గా మార్చి కార్మికుల హక్కులను హరించే విధానాలను దేశంలో బిజెపి పాలిత రాష్ట్రాలలో అమలుకు సాహసం చేయని నేటి పరిస్థితుల్లో ఆంధ్ర ప్రదేశ్లో మాత్రం చంద్రబాబు నాయుడు మొన్న జరిగిన క్యాబినెట్ సమావేశంలో 8 గంటల పని విధానాన్ని రద్దు చేస్తూ 10 గంటలు 12 గంటలు పని విధానానికి పచ్చ జెండా ఊపారని ఇది అత్యంత దుర్మార్గకరమైన విధానం అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మల్లేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కోట మాలాద్రి, భజంత్రీ శ్రీనివాస్, కల్లూరు జాన్, పి.మద్దిలేటి దొరసాని,రాష్ట్ర కోశాధికారి తాడికొండ వాసు,రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజేష్ గౌడ్, రాష్ట్ర నాయకులు మదన్ మోహన్, నాజర్ సత్యనారా యణ, శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి కళ్యాణ్ అప్పలరాజు, అన్నమయ్య జిల్లా కన్వీనర్ కో కన్వీనర్ ముబారక్, శ్రీనివాసులు, ఏఐటియుసి ఏలూరు జిల్లా అధ్యక్షులు ఆర్. శ్రీనివాస డాంగే, ఏలూరు నగర కార్యదర్శి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడిలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్

విశాలాంధ్ర-చింతలపూడి: సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్ కార్యక్రమాన్ని చింతలపూడి మండల వైద్యశాఖ ఆధ్వర్యంలో స్థానిక ఏరియా ఆసుపత్రిలో సూపరింటెండెంట్ నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా చింతలపూడి రూరల్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

అనంతరం చింతలపూడి మెడికల్ రూరల్ అసోసియేషన్ అధ్యక్షులు వజ్రపు శేఖర్ మాట్లాడుతూ ప్రతి ఒక్క మెడిసిన్ మీద 12 నుంచి ఐదు శాతంకు జీఎస్టీ తగ్గించడం వలన ప్రజలకు తక్కువ రేటులో మందులు అందించబడుతుందని తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీఎస్టీవో ఆర్. శ్రీనివాస్, ఏఈఓ వెంకటేశ్వరరావు, హాస్పటల్ అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు కొండ్రు దేవా, గుమ్మిశెట్టి భారతి, చింతలపూడి మండల మెడికల్ షాపు యజమానులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వంతెనపై వరద ఉధృతి

విశాలాంధ్ర - కుక్కునూరు: మండలంలోని గుండేటివాగు వంతెనపై గోదావరి ఉధృతి కొనసాగుతున్నది. గత మూడు నెలల నుంచి వంతెనపై వరద తగ్గుతూ,పెరుగుతూ వస్తున్నది. ఇటీవల వంతెన ముంపు నుంచి బయట పడింది. కాగా గోదావరి స్వల్పంగా పెరగడంతో వంతెన మళ్లీ ముంపునకు గురైంది.రెండు

రోజుల నుంచి వంతెన వరద ముంపులో ఉండటంతో సుమారు పది గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాదిలో గోదావరి ఐదు పర్యాయాలు పెరిగింది. మూడు నెలల నుంచి గుండేటివాగు వంతెన వరదలో మునిగిపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కృష్ణబలిజ కార్పొరేషన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-భీమవరం: కృష్ణ బలిజ సమాజం అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందని, కార్పొరేషన్ ద్వారా అందుతున్న వివిధ సేవలు, పథకాలను ప్రతి సభ్యుడు తప్పనిసరిగా వినియోగించుకోవాలని కృష్ణ బలిజ పూసల వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్

గంటా త్రిమూర్తులు అన్నారు. కృష్ణబలిజ సంఘీయుల ఆత్మీయ ఆహ్వానంపై గంటా త్రిమూర్తులు సైదాబాద్‌లోని దుర్గామాత ఆలయాన్ని దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రజలందరికీ శాంతి, సుభిక్షం కలగాలని, ప్రజల శ్రేయస్సు కోసం అమ్మవారిని ప్రార్థించి నట్లు మీడియాతో ముచ్చటించారు. అనంతరం జరిగిన సమావేశంలో గంటా త్రిమూర్తులు మాట్లాడుతూ కృష్ణ బలిజులు అభివృద్ధి చెందుతూ సమాజాభివృద్ధిలో భాగం పంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కావేటి శ్రీకాంత్, కావేటి మహేష్, భోశేటి కృష్ణ, భూమేష్, గంటా మణికంఠ, బొమ్మిడి వెంకటేశ్వరరావు, తోట వెంకటేశ్వరరావు, ముదరకోల సతీష్, తోట సురేష్, తోట గణేష్, ఇతర కృష్ణ బలిజ సంఘ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

యూనిట్ల తనిఖీ (1వ పేజీ తరువాయి)

18 తయారీ యూనిట్‌లను 19 హోల్‌సేల్ కేంద్రాలను క్షుణ్ణంగా సేఫ్టీ నామ్స్ పాటించినది, లైసెన్సులు అనుమతులను పొందినది లేనిది క్షుణ్ణంగా పరిశీలించి ప్రతి పాయింటు నమోదు చేస్తూ తయారీ యూనిట్లకు విడిగా హోల్‌సేల్ యూనిట్ల కు వేరే విధంగా రూపొందించిన ప్రొఫార్మాలో వివరాలు నింపి శనివారం సాయంత్రానికి కలెక్టరేట్‌కు అందించాలన్నారు.

తప్పనిసరి (1వ పేజీ తరువాయి)

సందర్భంగా బాణాసంచా విక్రయ కేంద్రాలకు తాత్కాలిక లైసెన్సులు జారీ చేసే విషయంలో అత్యంత జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. తయారీదారులు తయారు చేసిన బాణాసంచా స్టాక్ వివరాలు, అమ్మిన పరిమాణం, ఎవరికి విక్రయించారో వంటి సమాచారం ఒక రిజిస్టర్‌లో నిరంతరం నమోదు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ వై. మేఘ స్వరూప్, అదనపు ఎస్పీ డి.మురళి కృష్ణ, జెడిఆర్ఓ టి. సీతారామమూర్తి, ఆర్డీవోలు కృష్ణ నాయక్, రాణి సుస్మిత, డిఎస్పీలు దేవ కుమార్, భవ్య కిషోర్, జిల్లా ఫైర్ ఆఫీసర్ ఎం మార్టిన్ లూథరన్ కింగ్, డిపివో వి శాంత మణి, కార్మిక శాఖ సహాయ కమిషనర్ బిఎస్ఎంవలీ, అగ్నిమాపక, రెవెన్యూ, ఆరోగ్య తదితర శాఖల అధికారులు, బాణాసంచా తయారీదారుల సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పట్టదా? (1వ పేజీ తరువాయి)

న్యాయ స్థానాన్ని ఆశ్రయించారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ సర్కార్ సదరు ప్రాజెక్టు అనుమతులు సక్రమంగా లేవని ఐదు ఏళ్ళ పాటు ఆ పథకాన్ని మూసివేశారు. సరిగ్గా అదే సమయంలో ప్రభుత్వం పై వ్యతిరేకతతో అప్పటి ప్రధాన ప్రతిపక్ష నేత, మాజీ సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్ర వ్యాప్తంగా పర్యటనలో భాగంగా 2023 ఆగస్టు 8వ తేదీన పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం పరిశీలనలో భాగంగా పురుషోత్తపట్నం విచ్చేసి, అక్కడ జరిగిన ఉదంతాన్ని పరిశీలించారు. అదే సమయంలో నాడు కోర్టుకు వెళ్లిన రైతులు చంద్రబాబును కలిసి వారి గోడును వెళ్లబుచ్చారు. దీనిపై స్పందించిన చంద్రబాబు ఇంత వరకు నష్టపరిహారం అందని రైతులకు ఆరుశాతం వడ్డీతో నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తిరిగి అధికారం చేపట్టిన తర్వాత అప్పటి జిల్లా కలెక్టర్ నష్టపరిహారం అందని రైతుల వివరాలను ప్రభుత్వానికి పంపించడం జరిగిందని రైతులు ఆరోపించారు. ఇప్పటివరకు నష్టపరిహారం అంద లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు హయాంలో నైనా తమకు న్యాయం జరుగుతుందో లేదో ఆయన హామీ నెరవేరుతుందో లేదో చూస్తున్నామని చెప్పారు.

ఎక్కడి గొంగలి అక్కడే

ప్రభుత్వాలు మారినా ఎంతో మంది అధికారులు మారినా తమ పరిస్థితి ఎక్కడ వేసినగొంగళి అక్కడే ఉన్న చందాన ఉందని నిర్వాసితులు దుయ్యబట్టారు. అధికారులు, నాయకులు తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.వీటిపై జిల్లా కలెక్టర్‌కి అర్జీ సైతం అందజేశామని రైతులు తెలిపారు.

మనోవ్యథతో పలువురు రైతులు మృతి

తమ పంట పొలాలకు 8 ఏళ్లైనా ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించడంలేదని,మరో పక్క మిగిలిన భూములు సైతం క్రయ విక్రయాలు జరగకుండా 22 "ఎ" లో పెట్టారని వాపోయారు.దీంతో క్రయ విక్రయాలకు లేక పోవడంతో తమ పిల్లల పెళ్లిళ్లు, చదువులకు తీవ్ర ఇబ్బందులు పాలవుతున్నామని మండిపడ్డారు. కొంత మంది మనోవ్యథ చెంది మృతి చెందిన రైతులు సైతం ఉన్నారని పేర్కొన్నారు.

ఇప్పటికైనా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం "22 ఎ" చెర నుండి మిగులు భూములను తప్పించి సబ్ డివిజన్ చెయ్యాలని, నిర్వాసితులకు నష్టపరిహారం త్వరితగతిన అందించాలని తద్వారా రైతులకు మేలు చెయ్యాలని డిమాండ్ చేశారు.

పరిష్కరిస్తాం (1వ పేజీ తరువాయి)

ఉదయ్ శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ షణ్మోహన్, జిల్లా ఎస్పీ బిందు మాధవ్, ప్రభుత్వ విప్‌లు దాట్ల సుబ్బరాజు, యనమల దివ్య, ఎమ్మెల్సీలు పిడుగు హరి ప్రసాద్, కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖర్, ఎమ్మెల్యేలు నిమ్మకాయల చిన రాజప్ప, పంతం నానాజీ, వనమాడి కొండబాబు, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి, పౌర సరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్, జెడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీఎస్ఎన్ వర్మ, పెండెం దొరబాబు, పిఠాపురం జనసేన ఇన్చార్జి మర్రెడ్డి శ్రీనివాసు పాల్గొన్నారు. తొలుత సముద్ర వేటలో ప్రమాద వశాత్తు మరణించిన 18 మంది మత్స్యకారుల కుటుంబాలకు గ్రూపు యాక్సి డెంట్ ఇన్సూరెన్స్ క్రింద తొలివిడతగా ఒక్కొక్కరికి రూ. 5 లక్షల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన 90 లక్షల రూపాయల ఎక్స్ గ్రేషియా మొత్తాల చెక్కులను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన మాట-మంతి కార్యక్రమంలో ఉప్పాడ, కోనపాపపేట, అమీనాబాద్, మూలపేట తదితర మత్స్యకార గ్రామాల ప్రతినిధులు కె. రాంబాబు, కె. వెంకటరమణ, సిహెచ్ దావీదు, కొల్లి రాంబాబు, ప్రసాద్, సూరాడ రాజు, ముమ్మిడి జాన్సన్, కొండా వెంకటరమణ, బదే విజయ కుమార్, పైడిపల్లి రాజు, మత్స్యకార యువకులు మోసా దేవుళ్ళు, వంకా ఎఫేజు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సతీష్, మత్స్యకార మహిళ ఉమ్మిడి అమరేశ్వరి పారిశ్రామిక వ్యర్థాల వల్ల, ప్రకృతి వైపరీత్యాల వల్ల మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ఉపముఖ్యమంత్రికి వివరించి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది రెండు నెలల పాటు వేట నిషేధ కాలం ముగిసిన తరువాత వేటకు వెళ్లిన మత్స్యకారులకు సముద్రంలో చేపలు దొరకక ఆదాయం లేక అల్లాడుతున్నారని అన్నారు. నిషేధ సమయంలోనే పరిశ్రమలకు కూడా వ్యర్థాల విడుదలపై నిషేధం విధిస్తే మత్స్య సంపదకు ముప్పు ఉండదన్నారు. ఉప్పాడ, కోనపాప పేట వద్ద తీరం కోతకు గురి కావడం వల్ల మత్స్యకారులు ఇళ్లు కోల్పోతున్నారు. వారందరికీ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. మత్స్యకార కుటుంబాలలో చదువుకున్న యువతకు తీరంలో ఏర్పాటైన పరిశ్రమలలో ఇంటర్న్ షిప్ ద్వారా శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించాలని పేర్కొన్నారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మత్స్యకారుల సమస్యలను సావధానంగా ఆలకించి పరిష్కారంపై రాష్ట్ర, జిల్లా అధికారులతో చర్చించారు. ఉప్పాడ తీరంలో పరిశ్రమల వ్యర్థాలు సముద్ర జలాల్లో కలుస్తున్న అంశంపై ఎన్విరాన్మెంటల్ ఆడిట్ చేయిస్తామన్నారు. ఈ లోగా మూడు రోజుల్లోపు కాలుష్య స్థాయిపై ప్రాథమిక నివేదిక అందజేయాలని రాష్ట్ర పిసిబి మెంబర్-సెక్రటరీని కోరారు. అలల కోత నుండి ఉప్పాడ తీరరక్షణకు అవసరమైన సుమారు 320 కోట్లు నిధులు కేంద్ర హోం శాఖ నుండి విడుదల కావాల్సి ఉందని, ఇందుకు తాను స్వయంగా డిల్లీ వెళ్లి హోం మంత్రి అమిత్‌షాను కలుస్తానని ఉప ముఖ్యమంత్రి తెలిపారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం

విశాలాంధ్ర- చింతలపూడి: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని చింతలపూడి ఎంఈఓ-2 సొంగ కిరణ్‌బాబు అన్నారు. చింతలపూడి పట్టణంలో స్థానిక ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మండల స్థాయి క్రీడా పోటీలు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ కన్వీనర్ వేణు ఆధ్వర్యంలో నిర్వహించారు.

మండలంలోని అన్ని యాజమాన్య పాఠశాలల బాలబాలికలకు చింతలపూడి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ పోటీలు నిర్వ హిస్తున్నారు. 9, 10 తేదీలలో జరిగే ఈ పోటీలకు నూజివీడు ఉపవిద్య శాఖ అధికారి డాక్టర్ సుధాకర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి పోటీలను ప్రారంభించారు. మండల విద్యాశాఖ అధికారి ఎస్. కిరణ్ కుమార్ వాలీబాల్ కోర్టును ప్రారంభించారు. ఈ పోటీలలో గెలిచిన అభ్యర్థులను డివిజన్ స్థాయికి ఎంపిక చేస్తారని కన్వీనర్ వేణు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలస్థాయి కన్వీనర్ సీమోను, రిటైర్డ్ పిడి గిరిరాజ్, పీడీలు విద్యార్థులు పాల్గొన్నారు.

తగ్గిన జీఎస్టీపై అవగాహన

విశాలాంధ్ర-కొయ్యలగూడెం : క్యాన్సర్, షుగర్, బిపి, గుండె సంబంధిత సమస్యలు, మూత్రపిండాల వ్యాధులు వంటి దీర్ఘకాలిక రోగాల చికిత్సకు ఉపయోగించే మందులపై జీఎస్టీ 12 శాతం నుండి 5 శాతం వరకు తగ్గిందని బయ్యన్నగూడెం ప్రభుత్వ వైద్యులు

లూక్ స్టీఫెన్ పేర్కొన్నారు. మండలంలో బయ్యన్నగూడెం ప్రభుత్వాసుపత్రి వద్ద ప్రజలకు జీఎస్టీ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మందులపై కూడా జీఎస్టీ ధరలు తగ్గాయని ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్. సుబ్రమణ్యం తెలి పారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ శైలజ, సూపర్వైజర్లు, సత్య కృష్ణ ప్రసాద్, వెల్ఫేర్ అసిస్టెంట్ డి.శ్రీనివాస్, ఆసుపత్రి సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

రహదారికి రూ. 3 కోట్లు విడుదల హర్షణీయం

విశాలాంధ్ర-కొయ్యలగూడెం : మండలంలో బయ్యన్నగూడెం గ్రామం నుండి తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం రేగులకుంట గ్రామం వరకు నూతన ఆర్ అండ్ బి రహదారి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం మూడు కోట్ల రూపాయలు విడుదల చేయడం హర్షించదగ్గ విషయమని కూటమి పార్టీల నాయకులు పేర్కొన్నారు. గత ప్రభుత్వం వైఫల్యంతో ఈ రహదారిని నిర్మించలేకపోయారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామీణ ప్రాంతాలలో రహదారులను నిర్మించడం పట్ల ప్రజలకు సకల సౌకర్యాలు సమకూర్చున్నారని తెలిపారు. ఈ రహదారి నిర్మాణానికి కృషి చేసిన రాష్ట్ర జల వన రుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు, పోలవరం నియోజకవర్గం శాసన సభ్యులు చిర్రి బాలరాజుకు, ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్‌కు, ట్రైకర్ చైర్మన్ బొరగం శ్రీనివాస్‌కు కూటమి పార్టీల మండల అధ్యక్షులకు, ప్రజా ప్రతినిధులకు, నాయకులకు, పోలవరం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పారేపల్లి రామారావు కృతజ్ఞతలు తెలిపారు.

వైఎన్‌లో బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్

విశాలాంధ్ర - నరసాపురం : శ్రీ వై. యన్. కళాశాలలో మేరా యువ భారత్, మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్, స్పోర్ట్స్ కళాశాల స్పోర్ట్స్ డిపార్ట్మెంటు, ఐక్యూఏసి సంయు క్తంగా 'బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్'ను కళాశాలలో గురువారం నిర్వహించారు.

ఈ బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా విద్యార్థులకు రన్నింగ్, కబడ్డీ, జావాలిన్ త్రో, వాలీబాల్ కాంపిటీషన్స్ నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన వారికి మెడల్స్, మెమెంటోస్, సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ చింతపల్లి కనకరావు, నెహ్రు యువ కేంద్ర యూత్ కోఆర్డినేటర్ కోసూరి రాజేష్, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ కే.ఎస్.వి.రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సేవలను వినియోగించుకోవాలి

విశాలాంధ్ర-టి.నరసాపురం: ప్రజలందరూ ఆధార్ సేవలను వినియోగించుకోవాలని తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు తెలిపారు. వెలగపాడు పంచాయతీ, వీరభద్రవరం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన శాశ్వత ఆధార్ కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రంలోని పలు రకాల సేవలను ప్రజలందరూ వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లుకుంట సొసైటీ చైర్‌పర్సన్ శీలం సాయి వినయ్, సొసైటీ కార్యదర్శి కెవివి సత్యనారాయణ, వెలగపాడు సర్పంచ్ నైనారపు జలపాలు, వెలగపాడు టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు జోనుబోయిన బాషా, పలువురు నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు ముఖ్యం

విశాలాంధ్ర - ఉంగుటూరు : గ్రామాల అభివృద్ధి కోసం సర్పంచ్‌లు ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఉంగుటూరు ఎంపీడీవో మనోజ్ సూచించారు. గురువారం ఉంగుటూరు మండల పరిషత్ కార్యాలయంలో గణపవరం, నిడమర్రు మండలాల సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, గాంధీ చిత్రపటాలకు నివాళులర్పించారు. శ్రీనివాస్ రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు.

జీఎస్టీ తగ్గింపుతో పేద ప్రజలకు లబ్ధి

విశాలాంధ్ర -ఉంగుటూరు : పేద ప్రజల ఆరోగ్యం విషయంలో ఎన్డీఏ ప్రభుత్వం సూపర్ గిఫ్ట్ ఇచ్చిందని ఉంగుటూరు ఎంపీడీవో జి. ఆర్. మనోజ్ అన్నారు. గురువారం ఉంగుటూరు మండలం కాగుపాడు పీహెచ్‌సి వద్ద సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్‌పై ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీవో మనోజ్ మాట్లాడుతూ.. జీఎస్టీతో అన్ని ధరలు తగ్గాయన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జస్టిస్ బి.ఆర్.గవాయ్‌పై దాడి హేయం

విశాలాంధ్ర -భీమవరం: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ పై జరిగిన దాడి హేయమని, ఇది రాజ్యాంగంపైనా, ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి అని, మతోన్మాదాన్ని తలకెక్కించుకుని దాడికి పాల్పడిన న్యాయవాది రాకేష్ కిషోర్‌ను, అతన్ని పురికొల్పిన మతోన్మాద శక్తులను చట్టబద్ధంగా శిక్షించాలని, వారిపై దేశ బహిష్కరణ విధించాలని దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర కుమార్ డిమాండ్ చేశారు. జస్టిస్ బి.ఆర్.గవాయ్ పై సుప్రీం కోర్టులో మతోన్మాది చేసిన దాడిని నిరసిస్తూ గంటా గురువారం రాజ్‌ట్రస్ట్ కార్యాలయ ఆవరణలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరాహారదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి గత పదకొండేళ్ల విద్వేష పాలనకు పరాకాష్ట గా సిజెపై దాడి జరిగిందని, ఇటువంటి దుశ్చర్యలపై కఠిన చర్యలు తీసుకోకపోతే మతోన్మాదులు హత్యలకు కూడా పాల్పడతారని అన్నారు. రాకేష్ కిషోర్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. గొల్ల రాజకుమార్, పట్టెం శుభాకర్, గాదె మహేష్, గెద్దం జార్జి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు జాతి సంపద

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర -భీమవరం: విద్యార్థులకు చిన్ననాటి నుండే పెద్దలను గౌరవించడం తల్లిదండ్రులు నేర్పిస్తే నాడు వయోవృద్ధుల సమస్యలు ఉత్పన్నం కావని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం బ్యాంక్ కాలనీలోని శ్రీకృష్ణదేవరాయ సాంస్కృతిక సమితి ఫంక్షన్ హాలులో జిల్లా వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వ హించిన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ వృద్ధులు అంటే జాతీయ సంపద అన్నారు.

ఇంట్లో వృద్ధులు ఉండడం గొప్పగా అనుభూతి చెందాలని, వారి అనుభవం, ఆసరా, పెద్దరికం ప్రతి ఒక్క కుటుంబానికి వెన్నుదన్నుగా ఉంటాయ న్నారు. భారతీయ సంస్కృతిలో తల్లిదండ్రులకు, గురువులకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ప్రస్తుత సమాజంలో చిన్న కుటుంబాలుగా మారడం, కొంత విలువలకు ప్రాధాన్యత తగ్గడంతో వృద్ధులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఇది సరైనది కాదన్నారు. ప్రతి ఒక్కరూ వారి బాల్యంలో తల్లిదండ్రులు చేసిన సేవలను చిరస్థాయిగా గుర్తించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, వారు వృద్ధాప్యంలో ఉన్నప్పుడు వారిని జాగ్రత్తగా చూసుకోవాల్సిన అవసరం కూడా అంతే ఉందన్నారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన సంఘ నాయకులలో విశిష్ట సేవలు అందించిన వారిలో కొంతమందిని ఎంపికచేసిన వారికి చివరగా జిల్లా కలెక్టర్ శాలువా, పూలమాలతో సత్కరించి జిల్లా స్థాయిలో అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు బి.రామ్ కుమార్, జిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు అద్దాల నాగ సూర్య సత్యనారాయణ, శ్రీకృష్ణదేవరాయ సాంస్కృతిక సమితి కార్యదర్శి మెంటే పార్థసారథి, సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ అధికారి దాయన సురేష్ చంద్రజీ, వయోవృద్ధుల జిల్లా అప్పిలేట్ ట్రిబ్యునల్ సభ్యులు మేళం దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ఈట్ స్ట్రీట్

విశాలాంధ్ర -భీమవరం: పద్మాలయ థియేటర్స్ సమీపంలోని రాయలం రోడ్డు వెంబడి ఈట్ స్ట్రీట్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని, ఔత్సాహికులు ముందుకు రావాలని మున్సిపల్ కమిషనర్ కె.రాంచంద్రారెడ్డి అన్నారు. పట్టణంలోని హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్ల యాజమాన్యాలతో గురువారం ఈట్ స్ట్రీట్ ఏర్పాటు పై కమిషనర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈట్ స్ట్రీట్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దీని ద్వారా పట్టణంలో ట్రాఫిక్ సమస్య తగ్గుతుందని, చాలామందికి ఉపాధి కూడా దొరుకుతుందని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ రాంబాబు, మున్సిపల్ ఇంజనీర్ ఎం.త్రినాథ్, ఎంహెచ్ఓ, శానిటేషన్ సెక్రటరీలు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు ఎక్కడ?

విశాలాంధ్ర-కొయ్యలగూడెం: దోమల బారి నుండి ప్రజారోగ్యాలను రక్షించాలని కొయ్యలగూడెం మండల ప్రజలు కోరుతున్నారు. మండలంలో వివిధ గ్రామాలలో రాత్రి, పగలు తేడా లేకుండా దోమలు విజృంభిస్తూ ప్రజలను కుట్టడం వలన ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రి అధికారులు, పంచాయతీల అధికారులు, దోమల మందు (మిలాదిన్) పిచికారి ప్రతి ఏటా జూలై నెల నుండి డిసెంబర్ నెల వరకు గ్రామ పంచాయతీల పరిధిలో గల గ్రామాల పురవీధులలో మిలాదిన్ కలిపిన మిశ్రమాన్ని ఫాగింగ్ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మిలాదిన్ పిచికారి చేయడంతో దోమల విజృంభణ తగ్గుతుంది. జూన్ నెల నుండి వాతావరణంలో మార్పులు వస్తే ప్రజలకు విష జ్వరాలు ఎక్కువగా విజృంభించి ప్రజా ఆరోగ్యాలను దెబ్బతీస్తున్నాయి. ఒకపక్క వివిధ పంచాయతీలలో డ్రైనేజీలు పూడిక తీయకపోవడం వలన కూడా దోమలు ఎక్కువ అయ్యి ప్రజలపై దాడికి దిగుతున్నాయి. దోమలు కుట్టిన వెంటనే దద్దుర్లు వచ్చి దురదలు ఎక్కువగా వస్తున్నాయని ప్రజలు తెలుపుతున్నారు. పంచాయతీలలో మిలాదిన్ మిశ్రమాన్ని పిచికారి చేసే యంత్రాలు ఉన్నప్పటికీ వాటిని వినియోగంలోకి తేకపోవడం గమనార్హం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా ఆరోగ్యాలను పరిరక్షించడం కోసం కోట్లాది రూపాయలు ప్రవేశపెట్టి సకల సౌకర్యాలు కల్పిస్తున్నప్పటికీ ప్రజా ఆరోగ్యాన్ని పరిరక్షించాల్సిన సంబంధిత అధికారులు మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. వాతావరణంలో మార్పు రావడంతో మండలంలో ప్రజలకు మలేరియా, టైఫాయిడ్, దగ్గు, వంటి విష జ్వరాలు శరీరంలోకి వచ్చి పలు ఇబ్బందులకు గురిగురిచేసింది. దోమల నివారణకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఓట్ చోరీతో గద్దెనెక్కిన బీజేపీ

మాజీ కేంద్ర మంత్రి జేడీ శీలం

విశాలాంధ్ర -భీమవరం: ఓటర్ల జాబితా అవకతవకలపై కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్త ఉద్యమం చేపట్టిందని, దేశవ్యాప్తంగా 5 కోట్ల మందితో సంతకాల సేకరణ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ కేంద్ర మంత్రి జె.డి.శీలం అన్నారు. గురువారం భీమవరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక్కొక్క నియోజకవర్గంలో సుమారు 16 వేల సంతకాల సేకరణ చేపడుతున్నామన్నారు. బీజేపీ ప్రజల ఓట్లను దోచుకుని మూడో సారి గద్దెనెక్కిందని, ఓటర్ల జాబితాలో అనేక అవకతవకలకు పాల్పడి లేని ఓట్లను ఉన్నట్లుగా చూపించి, ఉన్న ఓట్లను తొలగించి, బీజేపీ ఓట్ చోరీకి పాల్పడిందని విమర్శించారు. ప్రతి ఒక్కరు తమ ఓటును హక్కుగా పొందాలనేది కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతమని, కేంద్ర ఎన్నికల సంఘం పారదర్శకంగా ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. త్వరలో జరగనున్న బీహార్ ఎన్నికల్లో బిజెపి కూటమి ఓడిపోవడం ఖాయమని, మహా కూటమి అధికారంలోకి రావడం తథ్యమని అన్నారు. కాంగ్రెస్ కమిటీ జాతీయ ప్రధాన కార్యదర్శి పాలక్ వర్మ, మాజీ ఎంపీ కనుమూరు బాపిరాజు, నర్సాపురం పార్లమెంట్ కాంగ్రెస్ కన్వీనర్ కే.బీ.ఆర్.నాయుడు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పాతపాటి హరికుమార్ రాజు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అనేది ఎంతో గొప్పదని, కార్యకర్తలు దేశానికి సేవలందించే భాగ్యం కలిగించే గొప్ప పార్టీ అని అన్నారు. పదవుల కన్నా పార్టీ ఇచ్చే బాధ్యతలే ముఖ్యమని, నేను కాదు మనం అనే భవనతో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్ బైపూడి నాగేశ్వరావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు సోడదాసి లూథర్ మార్టిన్, రాజ్‌కుమార్, జిల్లాలోని ఏడు నియోజకవర్గాల కో ఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్లో జీఎస్టీపై సదస్సు

విశాలాంధ్ర -భీమవరం: జీఎస్టీ స్లాబ్ తగ్గడంతో పేద, మధ్య తరగతి వర్గాలకు ఎంతో ఊరటనిచ్చిందని బలుసుమూడి అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యురాలు డాక్టర్ ఎస్. కృష్ణ దుర్గ అన్నారు. గురువారం అర్బన్ హెల్త్ సెంటర్లో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి సరాసరి 15 వేల రూపాయల వరకు ఆదా అవుతుందని అన్నారు. జీఎస్టీ సేవింగ్స్ పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ధరలు తగ్గించకపోతే దుకాణదారులను నిలదీయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ ఎ.లలిత కుమారి, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పీఎం జీవనజ్యోతి బీమా పైకం అందజేత

విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం: ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యువజన పథకం ద్వారా సహజ మరణానికి మంజూరైన రెండు లక్షల రూపాయల బీమా పైకాన్ని స్థానిక ఎస్బిఐ టౌన్ బ్రాంచి మేనేజర్ పిఆర్ సతీష్ కుమార్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా బ్రాంచి మేనేజర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ పాడిశెట్టి పద్మజ శ్రీనివాస్ ఎస్బిఐ సేవింగ్స్ అకౌంట్ ద్వారా ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకం నిమిత్తం ఏడాదికి రూ.436 చెల్లించారు. ఖాతాదారుడు ఆకస్మిక మరణంతో అతని భార్య పాడిశెట్టి ఉమాకు రెండు లక్షల రూపాయల బీమా పైకాన్ని గురువారం అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ కోటేశ్వరరావు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

గోదావరి పుష్కరాల పనులపై దృష్టి సారించాలి : జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

విశాలాంధ్ర -భీమవరం: 2027 గోదావరి పుష్కరాలకు జిల్లాలో చేయాల్సిన ఏర్పాట్లపై దృష్టి సారించాలని సంబంధిత అధికారులకు జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి దిశా నిర్దేశం చేశారు. గురువారం జాయింట్ కలెక్టర్ తన ఛాంబర్లో 2027 గోదావరి పుష్కరాలకు

సంబంధించిన ఏర్పాట్లలో భాగంగా యాత్రికుల సౌకర్యార్థం శాఖల వారి చేయవలసిన ఏర్పాట్లకు సంబంధించిన బడ్జెట్ రూపకల్పనపై రెవిన్యూ, పోలీస్, పంచాయతీ, పిఆర్ ఆర్ అండ్ బి, ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపాలిటీ, ఎలక్ట్రికల్, ఫైర్, కన్సర్వెన్సీ, మెడికల్, తదితర శాఖల జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే 2027 గోదావరి పుష్కరాలకు సంబంధించి యాత్రికుల సౌకర్యార్థం చేయవలసిన అభివృద్ధి పనులు వాటికి అయ్యే ఖర్చుకు సంబంధించి శాఖల వారిగా తయారుచేసిన బడ్జెట్ వివరాలను అడిగి తెలుసుకున్నారు.

శాఖల వారీగా చేయవలసిన పనులపై దిశా నిర్దేశం చేశారు. సమీక్ష సమావేశంలో డిఆర్‌ఓ బి.శివన్నారాయణ రెడ్డి, అడిషనల్ ఎస్పీ వి.భీమారావు, డిపిఒ రామ్నాథ్‌రెడ్డి, జిల్లా టూరిజం శాఖ అధికారి ఏవీ అప్పారావు, జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఉషారాణి, జిల్లా ఆర్డబ్ల్యూఎస్ అధికారి కె.శ్రీనివాసరావు, ఆర్అండ్ బి ఎస్.ఇ ఎ.శ్రీనివాసరావు, నరసాపురం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య, మత్స్యశాఖ ఏడి ఎల్.ఎన్ రాజు, కలెక్టరేట్ డిప్యూటీ తహసీల్దార్ మ(రా)వు సన్యాసిరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చేగువేరా (1వ పేజీ తరువాయి)

చేరుకున్న చేగువేరా గెరిల్లా పోరాట యోధుడుగా, సోషలిస్టు విప్లవ కారుడుగా మారి అమెరికా సామ్రాజ్య వాదానికి ఎదురొడ్డి నిలచి పోరాడాన్నారు. 1967లో అమెరికా గూఢచారి సంస్థ సిఐఏ చేగువేరాను ఉరి తీసిందన్నారు. చేగువేరా జీవితం పోరాట స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శం కావాలన్నారు. సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, ఏరియా కార్యదర్శి సికిలే పుష్పకుమారి, పట్టణ సమితి సభ్యులు గార ప్రసాద్, గుబ్బల వెంకటేశ్వరరావు, పుట్టా అమ్మిరాజు, నూనె రాధాకృష్ణ చేగువేరాకు నివాళులర్పించారు.

SBI భారతీయ స్టేట్ బ్యాంక్
ముదినేపల్లి బ్రాంచి, కృష్ణా జిల్లా.

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002లోని 13(2) క్రింద దిగువ వారికి

శ్రీ కొల్లిపర వెంకటేశ్వరరావు తండ్రి మల్లిఖార్జునరావు
డోర్ నెం:6-54/7, వడాలి రోడ్, ముదినేపల్లి, కృష్ణా జిల్లా.
హెచ్‌యల్ నెంబర్లు: **41649213961, 41652805634**
మేడమ్ / సార్,

మీరు **ముదినేపల్లి బ్రాంచి, కృష్ణా జిల్లా** నుండి ఈ దిగువ ఉదహరించిన స్థిరాస్తిని తనఖా ఉంచి వివిధ క్రెడిట్ ఫెసిలిటీస్ సౌకర్యాన్ని పొందియున్నారు. సదరు హోమ్ లోన్స్ ఋణము ది.06-10-2025వ తేదీ నాటికి మొత్తము బకాయి **రూ.33,54,837/-** (అక్షరాల ముప్పైమూడులక్షల యాభైనాలుగువేల ఎనిమిదివందల ముప్పైఏడు రూపాయిలు మాత్రమే) మరియు ఒప్పందపరమైన వడ్డీ తదుపరి కాస్ట్స్, ఛార్జీలు, ఇతరములైన ఖర్చులు మొత్తము బకాయిగా ఉన్నవి.

తనఖాపెట్టిన స్థిరాస్తి వివరము

కృష్ణా జిల్లా, ముదినేపల్లి, డోర్ నెం:6-54/7, ఆర్‌యస్ నెం.221/2 లోని 170 చ॥గ॥ల విస్తీర్ణములో నిర్మించిన ఆర్‌సిసి భవనము శ్రీ కొల్లిపర వెంకటేశ్వరరావు తండ్రి మల్లిఖార్జునరావు గారికి చెందిన రిజిష్టర్డ్ సేల్‌డీడ్ నెం.1075/2010, తేది:02-09-2010, ముదినేపల్లి యస్‌ఆర్‌ఒ కృష్ణా జిల్లా. **హద్దులు:** తూర్పు: పంట బోదె, దక్షిణం: మొహమ్మద్ సయ్యద్ బాజి యొక్క స్థలం, పడమర: బజారు, ఉత్తరం: బజారు.

శ్రీ కొల్లిపర వెంకటేశ్వరరావు తండ్రి మల్లిఖార్జునరావు మీకు బ్యాంకు వారు మంజూరు చేసిన ఋణసౌకర్యం నిమిత్తం పైన ఉదహరించిన స్థిరాస్తిని తనఖా ఉంచినారు. పైన పేర్కొనబడిన చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద **ది.06-10-2025వ తేదీన డిమాండ్ నోటీసును** బ్యాంకుచే మీకు జారీచేయడమైనది. కానీ జారీ చేసిన నోటీసును ఋణగ్రహీతలు స్వీకరించనందున **ఈ పత్రికా ప్రకటన జారీచేయడమైనది.** బ్యాంకు వారు జారీచేసిన షరతులు మరియు నిబంధనలు పాటించుటలో మీరు విఫలమైనందున ఖాతా క్రమము తప్పి ఆర్.బి.ఐ మార్గదర్శకాల ప్రకారం **ది:04-10-2025**న ఎన్.పి.ఎగా (మొండిబకాయి) వర్గీకరించబడినది. సదరు పైన తెలిపిన ఋణమొత్తము మరియు ఒప్పందపరమైన వడ్డీ ఈ ప్రకటన ప్రచురించిన తేదీ నుండి 60 దినములలో తిరిగి చెల్లించవలసినదిగా మిమ్మల్ని కోరడమైనది. లేనియెడల ఎటువంటి తదుపరి ప్రకటన లేకుండా సెక్షన్ 13(4) క్రింద పైన తెలిపిన సెక్యూరిటీపై SARFAESI చట్టం, 2002 లోని నిబంధనలు అమలు చేసేందుకు, చర్యలు చేపట్టుటకు సెక్యూర్డ్ క్రెడిటార్ అగు దిగువ సంతకందారునకు అధికారం కలదు. ఉద్దేశించబడిన చట్టంలో మరియు లేదా అమలులో ఉన్న ఏ చట్టం క్రింద మాకు లభించే ఏ ఇతర హక్కులకు భంగం కలుగకుండా ఇవి జారీచేయడమైనది.

తేది : 09-10-2025
ప్రదేశం: విజయవాడ

అధీకృత అధికారి
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు భారీ ఊరట

మంత్రి కొలుసు పార్థసారథి

విశాలాంధ్ర-ఆగిరిపల్లి: సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ జీఎస్టీ తగ్గింపు ద్వారా సామాన్యులకు మరింత డబ్బు ఆదా అవుతుందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. జీఎస్టీ తగ్గింపు తద్వారా ప్రజలకు ఏ విధంగా ఆదా చేకూరుతుందో తెలియజేయడానికి మొదటిగా ఆగిరపల్లి నగర వీధుల్లో ర్యాలీ నిర్వహించి వ్యాపారస్తులతో ముఖాముఖి మాట్లాడి అవగాహన కల్పించారు. అనంతరం ఆగిరిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సూపర్ జీఎస్టీ -సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. గతంలో నాలుగు స్లాబులుగా ఉన్న జీఎస్టీని కేవలం రెండు స్లాబులకే (5, 18శాతం) పరిమితం చేయడం ద్వారా వినియోగదారులకు భారీ ఉపశమనం లభిస్తుందని మంత్రి తెలిపారు. ఈ సంస్కరణల కారణంగా అనేక నిత్యావసర వస్తువులు, మందులు, ఇన్సూరెన్స్ వంటి వాటిపై పన్ను తగ్గడం లేదా జీరో పర్సెంట్ జీఎస్టీ పరిధిలోకి వచ్చిందని పేర్కొన్నారు. రైతులు ప్రజలు మరింత అవగాహన పెంపొందించుకుని జీఎస్టీ ఫలాలు అందుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జీఎస్టీ అధికారులు, మండల అభివృద్ధి అధికారి భార్గవి, తహశీల్దార్, పలు వ్యాపార వర్గాల ప్రతినిధులు,మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వేణు, ఇతర మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు జి. రఘు, వాసు, శ్రీనివాస్, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీవారి కల్యాణ మహోత్సవాలు

- కన్నుల పండువగా పుష్పయాగోత్సవం
- శయన మహావిష్ణు అలంకారంలో దర్శనం

విశాలాంధ్ర-ద్వారకాతిరుమల: ద్వారకా తిరుమల శేషాచల పర్వతంపై కొలువు తీరిన శ్రీవేంకటేశ్వరస్వామి ఆశ్వయుజ మాస తిరుకల్యాణ మహోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఎనిమిది రోజుల పాటు ఈ కల్యాణ ఉత్సవాలు భక్తులకు కనువిందు చేశాయి. ఈ ఉత్సవాల్లో చివరి రోజు గురువారం రాత్రి ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, పుష్పయాగోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా వేద పండితులు, అర్చకులు స్వామి, అమ్మవారను తొళక్కం వాహనంపై అలంకరించి ఆలయం చుట్టూ 12 సార్లు ప్రదక్షిణ చేయించారు. స్వామివారితో పాటు భక్తులు సైతం ఈ ప్రదక్షిణలో పాల్గొన్నారు. అనంతరం 12రకాల వాయిద్యాలతో 12రకాల గీతాలు ఆలపించి స్వామివారికి పవళింపు సేవ(పుష్పయా గోత్సవం) నిర్వహించారు.

విశేషంగా చూర్ణోత్సవం, వసంతోత్సవం

కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఉదయం శ్రీవారి పాదుక మండపంలో చూర్ణోత్సవం అత్యంత వైభవంగా జరిపించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను రాజాధి రాజ వాహనంపై ఆలయం వద్ద నుంచి తీసుకొచ్చి పాదుక మండపంలో కొలువుదీర్చారు. అనంతరం మంగళ స్నానాలను వేదో క్తంగా చేయించారు.

పుణ్యస్త్రీలను పిలిచి బుట్టలో ధాన్యం, పసుపుకొమ్ములు వేసి రోకళ్లతో సాంప్రదాయ బద్ధంగా దంచారు. తద్వారా వచ్చిన చూర్ణంతో స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు చేశారు.

కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు

విశాలాంధ్ర-వీరవాసరం: కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ప్రధానోపాధ్యా యులు కానుకొలను శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని రాయకు దురు జిల్లా పరిషత్ హైస్కూల్లో 10వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థి నిలు జిల్లా స్థాయిలో వారధి ఫౌండేషన్ నిర్వహించిన వివిధ పోటీలలో ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన సందర్భంగా వారిని గురువారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్తృత్వ పోటీల్లో సోషల్ మీడియా ఈజ్ ఎ యూజ్ ఫుల్ టూల్ ఫర్ ది స్టూడెంట్ లెర్నింగ్ అనే అంశంపై మాట్లాడి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానాన్ని పుచ్చుకాయల వెన్నెల, వ్యాసరచన విభాగంలో వాట్ రోల్ షుడ్ స్కూల్స్ ప్లే ఇన్ ప్రమోటింగ్ మెంటల్ హెల్త్ అనే అంశంలో దూది అంజలి జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానాన్ని పొందారని తెలిపారు. వక్తృత్వం జిల్లా స్థాయి పోటీలో ప్రథమస్థానాన్ని పొందిన విద్యార్థిని పి. వెన్నెల ఈనెల 18వ తేదీన రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలో ఆన్లైన్ విధానంలో పాల్గొంటుందన్నారు. కార్యక్రమంలో ప్రథమ సహాయకులు కె.వీరాస్వామి, ఆర్.తులసీ ప్రదీప్, వి.శేఖర్, లక్ష్మీదుర్గ, హరిప్రియ, కె.వి.డి.ప్రసాద్, బి.రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాలువలో కొట్టుకుపోతున్న మహిళను కాపాడిన పోలీసులు

విశాలాంధ్ర - బుట్టాయిగూడెం : ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు పొంగి ప్రవహిస్తున్న కాలువలో ప్రమాదవశాత్తు కొట్టుకుపోతున్న గిరిజన మహిళను బుట్టాయి గూడెం పోలీసులు ప్రాణాలతో రక్షించిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం

మండలంలోని జైనవారిగూడెం గ్రామం నుండి ఇరపా అన్నామణి అనే మహిళ వెలుతురు వారిగూడెం పుట్టింటికి వెళ్తుండగా జల్లేరు వాగు దాటే క్రమంలో ప్రమాదవశాత్తు నీటి ప్రవాహానికి కొట్టుకుపోతుండగా పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్ఐ దుర్గా మహేశ్వరరావు వెంటనే స్పందించి తన సిబ్బందితో హుటా హుటిన సంఘటన స్థలానికి చేరుకొని, గాలింపు చర్యలు చేపట్టి అన్నామణిని ప్రాణాలతో కాపాడారు. ఈ ప్రవాహ ఉధృతికి పోలీసుల సహాయంతో అన్నామణి సజీవంగా బయటపడటంతో బుట్టాయిగూడెం పోలీసు వారిని గ్రామస్తులతో పాటు పోలవరం డిఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, జీలుగుమిల్లి ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర రావు అభినందించారు. ఈ సందర్భంగా వాగులు దాటేటప్పుడు ప్రయాణి కులు తగు జాగ్రత్తలు వహించి ప్రయాణించాలని పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలకు కలర్ ప్రింటర్ బహూకరణ

విశాలాంధ్ర - గణపవరం: పాఠశాలల అభివృద్ధికి దాతలు సహకరించాలని గణపవరం మండ లం మొయ్యేరు ప్రాథమిక వ్యవ సాయ సహకార పరపతి సంఘం (సొసైటీ) చైర్ పర్సన్ కానుమిల్లి వెంకటేశ్వర

రావు (చంటి) అన్నారు. మొయ్యరు గ్రామంలో ఉన్న ఎంపీ యుపి ప్రభుత్వ పాఠశాలకు 32 వేల రూపాయల విలువగల కలర్ ప్రింటర్‌ను సొసైటీ సౌజన్యంతో బహుకరిం చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈఓ ఎం.దుర్గ శ్రీనివాసరావు, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సొసైటీ త్రిసభ్య కమిటీ సభ్యులు సిబ్బంది పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రజల ఆరోగ్యానికి ఊరట

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు గణపవరం మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి, గణపవరం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్పెషల్ ఆఫీసర్ ఆర్. బేబి శ్రీలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఆమె మాట్లాడుతూ సాధారణ మందులపై 12% నుండి 5% కు ప్రాణారక్షణ మందులు 12 %నుండి జీరో పర్సెంట్ కు టెస్టింగ్ కిట్స్ 12% నుండి 5% కు వైద్య ఆక్సిజన్ 18% నుండి 5% తగ్గించినట్లు తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధుల మందులపై 12% నుండి 5% కు ప్రాణ రక్షణ మందులపై పూర్తిగా జీఎస్టీ రద్దు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జాలాది విల్సన్ బాబు, భీమవరం టాటా లైఫ్ ఇన్సూరెన్సు కంపెనీ సూపర్వైజర్, బాల మురళి, సిహెచ్ విసత్యవతి, హెల్త్ అసిస్టెంట్ ఎంఎస్ యోహాను, కృష్ణంరాజు, ఎం.నల్లయ్య, ఏఎన్ఎంలు ఎస్తేరు, నాగవేణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యాయమూర్తుల రక్షణకు ప్రత్యేక చట్టం చేయాలి

విశాలాంధ్ర-రాజమండ్రి సిటీ: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయి పై దాడిని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ మెమోరియల్ ఫ్రెండ్స్ సర్కిల్ వెల్ఫేర్ అసోసియేషన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. గవాయిపై ఒక న్యాయవాది కోర్టు హాలులోనే దాడికి యత్నించడాన్ని అసోసియేషన్ నాయకులు తీవ్రంగా ఖండించారు.రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు బి.జార్జీ ఆంటోని మాట్లాడుతూ సీజేఐపై దాడి అంటే పవిత్ర న్యాయ వ్యవస్థపై దాడి చేయడమేనని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.సీజేఐ గవాయి ఒకకులాన్నిగానీ, మతాన్నిగానీ విమర్శించలేదని సోదరభావం తో ఆ న్యాయవాదికి సలహా ఇచ్చారని బద్దే జార్జి ఆంటోని పేర్కొన్నారు. ఆ సలహాను సానుకూల దృక్పథంతో స్వీకరించకుండా కోర్టులోనే ఏకంగా సీజేఐ పై దాడి చేయడం ప్రజాస్వామ్యవాదులను ఆందోళనకు గురి చేస్తోందన్నారు.అందుకే తక్షణం న్యాయ మూర్తుల రక్షణకు ప్రత్యేక చట్టం చేయాలని జార్జి ఆంటోని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే ఇటీవల చిత్తూరులో అంబేద్కర్ విగ్రహాన్ని ఉద్దేశపూర్వకంగా తగలబెట్టడాన్ని కూడా ఆయన తీవ్రంగా ఖండించారు.ఇలాంటి దుశ్చర్య లకు పాల్పడేవారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. విలేకరుల సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు నక్కా సోమేశ్వరరావు, గౌరవా ధ్యక్షులు ఎ.ప్రసాద కుమార్, సి.హెచ్.లూథర్ ఫ్రెడ్రిక్, ఉపాధ్యక్షుడు కుసుమ సాయిబాబా, కో ఆర్డినేటర్ కొంకి రమేష్,సలహాదారులు వి.డేవిడ్ రాజు, కె.శేషగిరిరావు, కార్యవర్గ సభ్యులు సి. హెచ్.సరస్వతి రావు,డి.ఆర్.పి. బాబు, ఎస్.విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు మండలంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ గౌరవ సభ్యుడు ఇ.లక్ష్మిరెడ్డి ఆకస్మిక తనిఖీలు

విశాలాంధ్ర-కొవ్వూరు: గురువారం రాష్ట్ర ఫుడ్ కమిషన్ గౌరవ సభ్యుడు ఈ లక్ష్మి రెడ్డి కొవ్వూరు మండలం వేములూరు, పసివేదల, నేలటూరు, చాగల్లు మండలాలలోని అంగన్వాడీ సెంటర్లు, జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలలోని మధ్యాహ్న భోజన పథకం సదుపాయాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. విద్యార్థులతో, ఎమ్ ఎస్ ఎల్ పాయింట్ వద్ద జట్టు కూలీలతో సంభాషించడం జరిగింది. అంగన్వాడీ సెంటర్లలో, ప్రభుత్వ పాఠశాలల వంటశాలల్లో భోజన సదుపాయాల నిర్వహణ, పౌష్టికాహారం, శుభ్రత తదితర అంశాలను తనిఖీ చేసి, పిల్లలకు సురక్షిత, పౌష్టిక భోజనం అందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని లక్ష్మీ రెడ్డి సూచించారు. పరిశుభ్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం చాగల్లు మండలంలోని ఓనగట్ల ఎమ్ఎస్ఎల్ పాయింట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫుడ్ కమిషన్ మెంబర్ వెంట జిల్లా బిసి సంక్షేమ అధికారి బి. శశాంక, డీఎం గణేష్ కుమార్, ఏఎస్ఓ ఎం. నాగంజనే యులు, ఏజీపీవో ఎం. రంగప్రసాద్, ఫుడ్ సేఫ్టీ అధికారి సుప్రియ , ఐ సి డి ఎస్ అధికారులు స్థానిక అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర-సీతానగరం: మండలంలో రామచంద్ర పురం గ్రామానికి చెందిన ఇరువురికి సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందచేసిన టీడీపీ రాజానగరం నియోజకవర్గ ఇంచార్జి, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి గురువారం అందచేశారు. రామచంద్ర పురం గ్రామానికి చెందిన పజ్జూరి వి. యస్ ప్రకాశరావు 75,833, ఏరుకొండ వెంకట లక్ష్మీ 41,084 రూపాయల నగదు చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ వైద్య ఖర్చుల ద్వారా ఆర్థిక ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ఈ సీఎం సహాయ నిధి చెక్కులు ఎంతగానో ఉపయోగ పడతాయన్నారు. కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గద్దె వెంకటకృష్ణ చౌదరి, బికిన సతీష్, సానేపల్లి వెంకట రామారావు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహాలకు సకల సౌకర్యాలు

విశాలాంధ్ర-రాజమండ్రి సిటీ : ఐదేళ్ల వైసీపీ పాలనలో సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక సదుపా యాలను గాలికి వదిలేశారని రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ15 నెలల్లో ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో అన్నిమౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని ఆయన చెప్పారు. గణేష్ చౌక్‌లో ఉన్న బీసీ బాలికల వసతి గృహాన్ని గురువారం స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు పరిశీలిం చారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని బాలికలకు అందుతున్న సదుపాయాలు, రక్షణ చర్యలు గురించి ఆయన ఆరా తీశారు. సదుపాయాలు బాగున్నాయని, భోజనం కూడా బాగుంటోందని, పాలు, గుడ్లు ఇస్తు న్నారని, రక్షణ చర్యలు కూడా చేపట్టారని, తామంతా నిశ్చింతగా ఉన్నామని బాలికలు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుతో ఆనం దంగా చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగన్ పాలనలో ఈ హాస్టల్‌లో ఉన్న 20 మరుగు దొడ్లు అధ్వాన్నంగా ఉండేవని 100 మంది బాలికలు ఉంటే కేవలం రెండు మాత్రమే పని చేసేవని ఆయన అన్నారు. బాలికలు విద్యాలయా లకు వెళ్ళడానికి తెల్లవారు జామున లేచి తయారవ్వాల్సి వచ్చేదని ఆయన గుర్తు చేశారు. కూటమి అధికార ంలోకి రాగానే సీఎస్సార్ నిధులతో వసతి గృహంలో మరుగుదొడ్లు బాగు చేయించి అందరికీ అందు బాటులోకి తీసుకువచ్చా మని చెప్పారు. ఈ 15 నెలల్లో పేపరుమిల్లు తదితర వాటినుంచి రూ.86 లక్షల సీఎస్సార్ నిధులతో వసతిగృహాల్లో మౌలిక సదుపా యాలు కల్పించామ న్నారు. రైతుబజారు వెనుక కొందరు ఆకతాయిలు మద్యం, మాదకద్రవ్యాలు సేవించడం తమ దృష్టికి వచ్చిందని, వాటిని అరికట్టేందుకు చర్యలు చేపట్టామని, స్థానిక వ్యాపారులు ఈ బాధ్యత తీసుకోవాలని సూచిం చామని ఎమ్మెల్యే తెలిపారు. పార్టీ నాయకులు, కార్య కర్తలు, స్థానిక నాయకులు ఆయన వెంట ఉన్నారు.

సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్" ప్రచారంకు విశేష స్పందన

విశాలాంధ్ర-తూర్పుగోదావరి : తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం పాలచెర్ల గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురు వారం సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్" జిల్లా వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమం నిర్వహి ంచారు. కార్యక్రమంలో జీఎస్టీ 2.0 సంస్కరణల వల్ల మందులు, వైద్య పరికరాలు, బీమా ప్రీమియంలపై పన్ను తగ్గడం ద్వారా ప్రజలకు గణనీయమైన ఆర్థిక లాభం కలుగుతు ందని అధికారుల ద్వారా వివరించబడింది. ప్రజలకు తక్కువ ధరల్లో మందులు, చవకగా భీమా సదుపాయం అందుబాటులోకి రావడం ఆరోగ్య భద్రతకు దోహదం చేస్తుందని పేర్కొన్నారు. డీఎం &హెచ్ఓ కె. వెంకటేశ్వర రావు మాట్లాడుతూ "ప్రాణరక్షక మందులపై పన్ను రద్దు చేయడం, వైద్య సేవలపై జీఎస్టీ తగ్గిం చడం ప్రజలకు ఊరట కలిగించే నిర్ణయాలు. ప్రభుత్వం ప్రజల ఆరోగ్య రక్షణకు కట్టుబడి ఉందన్నారు. జీఎస్టీ 2.0 కు సంబంధించి ఏవైనా ఫిర్యాదుల కోసం తూర్పు గోదావరి జిల్లా కంట్రోల్ రూమ్ నంబర్: o91 87126 31290 ను సంప్రదించవచ్చని తెలిపారు. జీఎస్టీ 2.0 కు సంబంధించి ఏవైనా ఫిర్యాదులు, సాంకేతిక సమస్యలు లేదా సహాయం కోసం పౌరులు టోల్ ఫ్రీ నంబర్ 1800-1200-232 (CBIC Mitra Helpdesk)కు, రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖకు సంబం ధించిన ఫిర్యాదుల కోసం 0866-2821183 నంబర్ లేదా apct.helpdesk@gmail.comకు మెయిల్ చేయవచ్చు అని తెలియ చేశారు. వినియోగదారులు బిల్లుల్లో జీఎస్టీ తగ్గింపులు అమలు కాలేదు లేదా అధిక పన్ను వసూలు వంటి అంశాలపై ఫిర్యాదు చేయాలనుకుంటే 1915 వినియోగదారుల హెల్ప్‌లైన్ ద్వారా కూడా సమాచారం అందిం చవచ్చు అని తెలియ చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ డీఎమ్హెచ్ఓ కోమలి, డా బెంటి ంద్, పాలచెర్ల సర్పంచ్ స్థానిక ప్రజాప్రతినిధులు గంగిశెట్టి చంటిబాబు గంగిశెట్టి వసంతరాయుడు, రాజేంద్ర ప్రసాద్ బిందు శేఖర్, బ్యాంకర్లు, పోస్టల్ శాఖ సిబ్బంది, మెడికల్ షాపు యజమానులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

బోధనేతర పనులు, విద్యాశక్తి కార్యక్రమాలు బహిష్కరిస్తూ, మెమోరండం సమర్పణ

ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య

విశాలాంధ్ర-కడియం : అక్టోబర్ 10 వ తేదీ, శుక్రవారం నుండి బోధనేతర పనులు, విద్యాశక్తి కార్యక్రమాలను బహిష్క రిస్తూ మండల విద్యాశాఖ అధికారి ఎం మణి కుమార్‌కి మెమోరండం సమర్పించి నట్లు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఎఫ్ఎపిటిఒ) చైర్మన్ ఎల్ సాయి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మితిమీరిన బోధనేతర కార్యక్రమాల వలన బోధనా సమయం హరించుకుపోతుందని, ఉపాధ్యాయులకు కూడా బోధనపై ఆసక్తి తగ్గిపోయే విధంగా బోధనేతర కార్యక్రమాలు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. పలుదఫాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. బోధనేతర పనులను అక్టోబర్10వ తేది నుండి బహిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య రాష్ట్ర కమిటీ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకంకు సంబంధించిన పనులు మాత్రమే ఉపాధ్యాయులు చేపడతారని, మూల్యాంకనానికి సంబంధి ంచిన పరీక్షల నిర్వహణ తప్ప, ఏ ఇతర బోధనేతర పనులను చేపట్టబోరని తెలియ జేస్తూ ఎంఈఓ కి మెమోరండం సమర్పించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్ర మంలో కే రమేష్, ఎస్ అనిత, ఎస్ శ్రీనివాస్, బి అబ్బాయి, పివివి గోపాలకృష్ణ, కే శ్రీకాంత్, వి వరలక్ష్మి, ఎస్ సత్యనారాయణ, రమణమూర్తి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరి మహా పుష్కరాలకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలి

భక్తుల సౌకర్యాల కోసం సమగ్ర చర్యలు చేపడదాం
- ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

విశాలాంధ్ర-కొవ్వూరు: గోదావరి మహా పుష్కరాలు - 2027 నిర్వహణ నేపథ్యంలో కొవ్వూరు పట్టణం పరిధిలో అభివృద్ధి పనుల విషయంలో ఇప్పటి నుంచే పక్కా ప్రణాళికలతో కూడిన ప్రతిపాదనలు సిద్ధం చేయా లని కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, కొవ్వూరు శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు సూచించారు. గురువారం స్థానిక ఆర్డీవో కార్యాల యంలో 2027 గోదావరి మహా పుష్కరాల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రాణి సుస్మిత మాట్లాడుతూ 2027 గోదావరి మహా పుష్కరాల ఏర్పాట్లు, మౌలిక వసతులు, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని నివేదికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. 2027లో గోదావరి పుష్కరాలు రానున్న తరుణంలో ఏర్పాట్లను ముందస్తుగా పక్కా ప్రణాళికలతో సిద్ధం చేయాలని సూచించారు. కొవ్వూరు డివిజన్‌లో ప్రధానంగా 48 పుష్కర ఘాట్లు ఉన్నాయని, వాటిని అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పంచాయతీరాజ్, ఇరిగేషన్ శాఖల ఆధ్వర్యంలో నిర్మాణ పనులకు నివేదికలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. కొవ్వూరు డివిజన్‌లో 67 దేవాలయాల అభివృద్ధికి మొదటి విడతగా ?9.87 కోట్ల రూపాయలు మంజూరు అయినట్లు ఆమె వెల్లడించారు. ఇకపై వారానికి ఒక్కసారి పుష్కరాల ఏర్పాట్లపై సమీక్ష సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కొవ్వూరు శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గోదావరి పుష్కరాలకు రాజమహేంద్రవరం జిల్లా కేంద్రంగా ఉండడం వల్ల భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని కొవ్వూరు నియోజకవర్గం వైపు కూడా భక్తులను పంపేలా ఏర్పాట్లు చేస్తున్నా మని తెలిపారు.ఘాట్ల అభివృద్ధి, దేవాలయాల మరమ్మతులు, భక్తుల సౌకర్యాల కోసం తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కొవ్వూరు ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వద్ద అభివృద్ధి పనులకు టూరిజం శాఖతో ప్రణాళికలు సిద్ధం చేయమని తెలిపారు. కొవ్వూరు పట్టణ అభివృద్ధికి ఇది మంచి అవకాశం అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కంఠమని రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, సూరపనేని చిన్ని, డీఎస్పీ దేవ కుమార్, జిల్లా దేవాదాయ శాఖ అధికారి పీవీ సుబ్బారావు, మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ డీఈఈ కే. ఆనంద బాబు, తహసీల్దార్ ఎం. దుర్గాప్రసాద్ తదితర అధికారులు పాల్గొన్నారు.

సప్పక్ తక్రా పోటీలకు ఎంపికలు

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలం రామన్నపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్లో జూనియర్ బాల బాలికల సప్పక్ తక్రా ఎంపిక పోటీలు జరిగాయి. ఈ పోటీలలో 100 క్రీడాకా రులు పాల్గొన్నారు. జిల్లా సెలక్షన్లు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 11, 12 తేదీల లో బాపట్ల జిల్లాలో బాపట్లలో జరిగే జూనియర్ సపక్ తక్రా రాష్ట్ర పోటీలలో పాల్గొ ంటారని రామన్నపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధాన ఉపాధ్యాయుడు పాలెం రవీంద్రనాథ్ తెలిపారు. జిల్లా పీడీలు సీనియర్స్ పాల్గొన్నారు. ఎంపికైన జట్టు వివరాలను ఆయన తెలిపారు. బాలుర విభాగంలో జి కోట సతీష్, ఎం అఖిల్, వై పాల్, అంతోనీ, జలంత, బి చరణ్, ఎం సతీష్, ఏ వివేక్ బి రామకృష్ణ ఎంపికైనట్లు రవీంద్ర తెలిపారు. బాలికల విభాగంలో బి దుర్గా మాధురి శ్రీ శ్రీ మహాలక్ష్మి ఎం లాస్య ఎస్కే మనీషా బేగం ఎం జె సి శ్రీ సౌజన్య కె సుభాషిణి ఎంపికైనట్లు ప్రధాన ఉపాధ్యాయుడు రవీంద్రనాథ్ తెలిపారు. పీడీలు ఎల్ గణపతి తలారి సరస్వతి సిహెచ్ సతీష్ పి సాయి ఈ శివ తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ పై స్పెషల్ డ్రైవ్

విశాలాంధ్ర - పెదపూడి : తడి చెత్త, పొడి చెత్త పై శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో ఇంచార్జ్ ఎంపీడీవో మేడపాటి సత్యనారాయణరెడ్డి ప్రజలకు అవగాహన కల్పించారు. గురువారం పెద్దాడ పంచాయతీ ఎస్సీ పేటలో ఇన్చార్జ్ ఎంపీడీవో ఎంఎస్ఎన్ రెడ్డి శానిటేషన్ పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి చెత్త నుండి సంపద సృష్టి గురించి క్షుణ్ణంగా వివరించారు. ప్లాస్టిక్ వాడకం పూర్తిగా నిషేధించాలని సూచించారు. పరిశు భ్రతతో అనారోగ్య సమస్యలు తలెత్తవని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మన్యం శ్రీనివాస చౌదరి, జూనియర్ అసిస్టెంట్ భాను, ఫీల్డ్ అసిస్టెంట్ నారాయణ రావు పాల్గొన్నారు.

సురక్షిత రేడియేషన్ చికిత్సకు అత్యాధునిక "ఎలెక్టా యూనిటీ ఎం.ఆర్-లినాక్" దోహదం

విశాలాంధ్ర-రాజమండ్రి సిటీ : భారతదేశ చరిత్రలో క్యాన్సర్ చికిత్సలో ఒక సరికొత్త ఒరవడి మొదలైందని, రేడియోథెరపీ తీసుకునే రోగులకు యశోద ఆస్పత్రిలో ఎంఆర్ లినక్ ద్వారా అత్యధునాతన చికిత్సలు అందుబాటులోకి వచ్చాయని, ఈ అత్యధునాతన పరిక రాలు యశోద ఆసుపత్రి హైటెక్ సిటీలో ప్రారంభించామని సీని యర్ కన్సల్టెంట్ రేడియేషన్ ఆంకాలజిసు, క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సునీత పేర్కొన్నారు. రాజమహేంద్ర వరంలో స్థానిక జాంపేట కు సమీపంలో ఉన్న యశోద ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. సాధారణంగా రేడియే షన్ థెరపీ తీసుకునే రోగులు చాలా టెన్షన్‌కు గురవుతారని, రేడియేషన్ వల్ల సైడ్ ఎఫెక్ట్స్ వస్తాయా?', 'భవిష్యత్తులో ఏమైనా ఇబ్బందులు ఉంటాయా?' అనే ప్రశ్నలు చాలా సాధారణంగా ఉంటాయని అలాంటి భయాలను తగ్గించి, మరింత కచ్చితమైన సురక్షితమైన రేడియేషన్ చికిత్స అందించడానికి ఎంఆర్ లినాక్ అనే అత్యాధునిక టెక్నాలజీని హైటెక్ సిటీలో యశోదా హాస్పిటల్స్‌లో ప్రవేశపెట్ట మన్నారు. రేడియేషన్ థెరపీలో పేషెంట్లకు తలనొప్పి, స్కిన్ ఇరి టేషన్, బలహీనత, వాంతులు, మూత్రంలో లేదా మోషన్‌లో రక్తం వంటి సైడ్ ఎఫెక్ట్స్ రావచ్చునని, కాని ఎంఆర్ లినాక్ టెక్నాలజీతో ఇవన్నీ చాలా వరకు నివారించవచ్చు నన్నారు. ముఖ్యంగా బ్రెయిన్ ట్యూమర్లలో ఎమారై గైడెన్స్ వల్ల ట్యూమర్ స్పష్టంగా కనిపించడంతో, రేడియేషన్‌ను మిల్లీ మీటర్ స్థాయిలో ఇవ్వగలు గుతున్నామన్నారు. శారీరకంగా కూడా పెద్ద ఉపశమనం ఇస్తుందని డాక్టర్ సునీత తెలిపారు. ఈ మీడియా సమావేశంలో యశోద హాస్పిటల్-హైటెక్ సిటీ డిజియం సంతోష్ కుమార్, ఆంధ్రప్రదేశ్ మార్కెట్ టీం లీడర్ ఎస్ బాల వీరబద్ర, అసిస్టెంట్ మేనేజర్ ఎండీ హుస్సేన్ షరీఫ్ , ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో స్టాండ్ ఏర్పాటుకు ప్రయత్నిస్తా

విశాలాంధ్ర-జగ్గంపేట:ఆటో స్టాండ్ లేకపోవడంతో జగ్గంపేటలోని ఆటో కార్మికులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని త్వరలో స్టాండ్ ఏర్పాటుకుప్రయత్నిస్తామని కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ అన్నారు. గురువారం ఆయన వీరమ్మ చెరువు కాలువను పరిశీలిం చిన అనంతరం స్లాబ్ నిర్మాణం చేస్తే ఆటో కార్మికులు ఆటోలను నిలుపుదల చేయడానికి బాగుంటుందని ఆయన అన్నారు. స్లాబ్ నిర్మాణ ఏర్పాట్లకు గాను ప్రణాళిక రూపొందిస్తామన్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఆటో కార్మికులు పడుతున్న ఇబ్బందులు తనకు తెలుసునని సరైన పరిష్కారం దిశగా ముందుకు సాగుతున్నామన్నారు. ఆటో స్టాండ్ సమస్యపై నవీన్ కుమార్ దృష్టి సారించినందుకు కార్మికులు ఆనందం వ్యక్తం చేశారు. త్వరలో తమ కష్టాలు తీరే రోజు దగ్గర పడిందని వారు ఆస భావం వ్యక్తం చేస్తున్నారు. ఆయన వెంట టీడీపీ సీనియర్ నాయకులు ఎస్‌విఎస్ అప్పలరాజు, జీను మణి బాబు, దేవరపల్లి మూర్తి, వేములకొండ జోగారావు, రాయి సాయి, రేఖ బుల్లి రాజు, జై కొత్తూరు బద్దె సురేష్, అంజి బాబు, గుర్రప్పాలు వల్లి తదితరులు ఉన్నారు.

అధికారుల నిర్లక్ష్య వైఖరితో అగ్ని ప్రమాదం

విశాలాంధ్ర-పెదపూడి : అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేయకపోవడం, భద్రత చర్యలు తీసుకోకపోవడం, నిర్లక్ష్య వైఖరి వలన గణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్ లో ద్వారా అగ్ని ప్రమాదం జరిగిందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారా యణ రెడ్డి ఆరోపించారు. గురువారం కొమరి పాలెంలో మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ బిక్కవోలు మండలం కొమరిపాలెం శివారు గణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్‌లో ఎనిమిది మంది మృతి చెందడం మరో ఇద్దరు ప్రాణాపాయ స్థితిలో ఉండటం ఆవేదన కలిగిస్తోందన్నారు. వైయస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వైజాగ్ ఎల్జీ పాలిమర్స్ ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు ఒక్కొకరికి కోటి రూపాయలు పరిహారం చెల్లించడం జరిగిందని అదేవిధంగా కొమరిపాలెం ఘటన బాధిత కుటుంబాలకు అదే స్థాయిలో నష్టపరిహారం అందించాలని, గాయపడి ప్రస్తుతం ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారి అందరి వైద్య ఖర్చు ప్రభుత్వమే భరించాలని మాజీ ఎమ్మెల్యే సత్తి డిమాండ్ చేశారు.

చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు పరిశీలన

విశాలాంధ్ర-కరప : కరప మండలం అరట్లకట్ట గ్రామంలో గురువారం ఎంపీడీవో సలాది వెంకట శ్రీనివాసరావు పర్యటించి చెత్త నుండి సంపద తయారు కేంద్రాల యొక్క పనితీరును పరిశీలించారు. వేస్టేజ్ కలెక్షన్ పై తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. ఐవీ ఆర్ఎస్ కాల్స్ పై ప్రజలకు అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి రాంజీ హీరాలాల్, పారిశుద్ధ్య సిబ్బందిపాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ
మండల ప్రజాపరిషత్, కడియం

టెండరు నోటీసు నెం. 1/2025 తేది : 09-10-2025

కడియం మండలములోని వేమగిరి గ్రామపంచాయితీలో మండల ప్రజాపరిషత్ నిధులతో మంజూరు కాబడిన నాలుగు పనులు చేయుటకు రిజిస్టరు కాబడిన కాంట్రాక్టర్ల నుండి సీల్డు టెండర్లు కోరడమైనది. 1) టెండర్ షెడ్యూల్స్ కొరకు దరఖాస్తు చేయుటకు ఆఖరు తేది : 22-10-2025, 2) టెండర్ షెడ్యూల్స్ దాఖలు చేయుటకు చివరి తేది : 24-10-2025 మధ్యాహ్నం గం. 3.00 వరకు. 3) టెండర్ షెడ్యూల్స్ ఓపెన్ చేయు తేది : 24-10-2025 మధ్యాహ్నం గం. 3.30 లకు. మిగిలిన వివరముల కొరకు కడియం ప్రజాపరిషత్ కార్యాలయము నందు కార్యాలయ పనివేళలలో సంప్రదించగలరు.

సం/- కె.రమేష్
మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల ప్రజాపరిషత్, కడియం

జగ్గంపేటలో త్వరలో అన్న క్యాంటీన్

- నిర్మాణ పనులు పరిశీలించిన కాకినాడ టీడీపీ జిల్లా పార్టీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్

విశాలాంధ్ర-జగ్గంపేట : కూటమి ప్రభుత్వ హామీలలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న అన్న క్యాంటీన్ నిర్మాణం జగ్గంపేటలోని తుది దశకు చేరుకుంది. మూడు పూటలా పేదవాడికి భోజన వసతి కల్పించ డమే ఎన్టీఆర్ ఆలోచనని ఆయన అన్నారు. దాంతో భాగంగానే గత నాలుగు ఏళ్లగా వారంలో సోమవారం రోజున జగ్గంపేటలోని ఎన్టీఆర్ క్యాంటీన్ నిర్మా ణం లేకపోయినా వసతులు కార్యకర్తల ఆర్థిక సహకారంతో కొనసాగుతున్న విషయం అందరికీ తెలిసిందే. ప్రభుత్వ ఏర్పడిన తర్వాత అన్నా క్యాంటీన్ ప్రతిరోజూ అన్నదాన వసతిగాను జగ్గంపేట నిర్మించడానికి నిధులు కేటాయిం చగా ఆ పనులు తుది దశకు చేరుకున్నట్టు నవీన్ కుమార్ తెలిపారు. కొద్ది రోజుల్లోనే అన్న క్యాంటీన్ సేవలు అందుబాటు లోకి వస్తాయి అన్నారు. నవీన్ కుమార్ వెంట దేవరపల్లిమూర్తి, పాండ్రంగి రాంబాబు, రేఖ బుల్లి రాజు, పిలా మహేష్, మండపాక అప్పన్న దొర, రాయి సాయి, బద్రి సురేష్, అంజిబాబు, కుంచె శ్రీను, డిఈ ఉమాశంకర్, జేఈ నారాయణమూర్తి పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పై అవగాహన

విశాలాంధ్ర-కరప : కరప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు గురువారం ఎంపీడీవో సల్లాది వెంకట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టి సూపర్ సేవింగ్స్ పై ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ పన్నుపు తగ్గించడం వలన ప్రజలకు ఆరోగ్య ఖర్చులు కలిసి వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నిర్మలాదేవి, హెచ్‌వీలు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపు సామాన్యులు పాలిట ఓ వరం

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగిశెట్టి చంటిబాబు

విశాలాంధ్ర - రాజానగరం : భీమా రంగంలో జీఎస్టీ తొలగింపు, వివిధ రంగాల్లో తగ్గింపు సామాన్యులు పాలిట ఓ వరమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి,మండల టీడీపీ అధ్యక్షులు గంగిశెట్టి చంటిబాబు అన్నారు. మండలంలోని పాలచర్ల గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రం(పి హెచ్ సి) నందు జీఎస్టి మెగా సేవింగ్స్ పై కలిగే ప్రయోజనాలు కోసం ప్రజలకు గురువారం అందించిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పై భారం పడుతున్నప్పటికీ దేశ ప్రధాని నరేంద్ర మోదీ, ఏపీ సీఎం చంద్రబాబు సామాన్యుల కోసం తీసుకున్న సంచలన మైన నిర్ణయమని కొనియాడారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన తూర్పు గోదావరి జిల్లా డీఎంఅండ్ హెచ్వో డాక్టర్ వెంకటశ్వరావు మాట్లాడుతూ జీఎస్టి తగ్గింపు తో అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ప్రయోజనాలు పొందిన ప్రతి ఒక్కరు తమ తోటి వారికి అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. అలాగే వివిధ భీమా సంస్థలు ప్రతినిధులు ఆయా శాఖలు అందిస్తున్న సేవలను తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిఐవో డాక్టర్ కోమలి,ఎన్డీఏ కూటమి నాయకులు గంగిశెట్టి వసంత రాయుడు,రాజేంద్ర ప్రసాద్,బిందు శేఖర్, పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఎన్.వి.రమణ, పి. హెచ్. ఎన్. ఈ. మంగతాయారు, హెచ్.వి. పరిమళ కుమారి తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లిలో అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు

- భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు
- ఎమ్మెల్యే బండారు సత్యానందరావు
- ప్రతి గ్రామం నుంచి ఉచిత బస్సులు ఏర్పాటు

విశాలాంధ్ర-ఆత్రేయపురం : కోనసీమ తిరుమలగా ప్రసిద్ది చెందిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. వేలాది మంది భక్తులు తరలి వచ్చే అవకాశం ఉండటంతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన చెప్పారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తున్నారని వివరించారు. ట్రాఫిక్ సమస్యలు లేకుండా, శానిటేషన్, తాగునీరు, అన్నప్రసాదం వంటి సౌకర్యాలను సమగ్రంగా కల్పించినట్లు పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణాన్ని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి, కళ్ళు మిరిమిట్లు గొలిపేలా లైటింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులను ఆకట్టుకునే విధంగా సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్లు చెప్పారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈసారి ఎక్కువ సంఖ్యలో భక్తులు రానున్నారని ఎమ్మెల్యే అంచనా వేశారు. స్త్రీ శక్తి పథకంలో భాగంగా మహిళలు ఉచిత బస్సు సదుపాయాన్ని వినియోగించుకుంటూ ఎక్కువగా తరలి వస్తారని తెలిపారు. కొత్తపేట నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుండి ఉచిత బస్సులు ఏర్పాటు చేశామని, ప్రతి రోజు సాయంత్రం 5 గంటలకు బస్సులు బయలుదేరి రాత్రి 8 గంటలకు తిరిగి గ్రామాలకు చేరుకుంటాయని వివరించారు. తిరుమలలో జరిగే వాహన సేవల మాదిరిగానే వాడపల్లిలో కూడా వాహన సేవలు నిర్వహించనున్నామని చెప్పారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని స్వామివారి దర్శనం పొందాలని, కోనసీమ తిరుమల వైభవాన్ని ప్రత్యక్షంగా ఆస్వాదించాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు విజ్ఞప్తి చేశారు.

ఆదిత్య విశ్వవిద్యాలయం మేనేజ్మెంట్ అధ్యాపకురాలికి డాక్టరేట్

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం, సూరంపాలెంలోని స్థానిక ఆదిత్య యూనివర్సిటీలో స్కూల్ ఆఫ్ బిజినెస్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సేవలు అందిస్తున్న నిషా కుమారికి గీతం (డీమ్డ్ టు బి యూని వర్సిటీ) విశాఖపట్నం వారు డాక్టరేట్‌ను ప్రదానం చేశారని ప్రో వైస్ ఛాన్సలర్ డా రవి తంగజన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గీతం విశ్వ విద్యాలయంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఐ బంగార్రాజు పర్యవేక్షణలో నిషా కుమారి సమర్పించిన గ్రంథానికి రూరల్ మైక్రో-ఎంటర్ ప్రెన్యూర్ షిప్ అండ్ మైగ్రేషన్ ఏ స్టడీ ఫ్రమ్ ది ప్రిజం ఆఫ్ ఎంజిఎన్ఆర్ఇజిఏ డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీని అందుకున్నారని తెలిపారు. డా నిషా కుమారి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆదిత్య విశ్వవిద్యాలయం ఛాన్సలర్ డా ఎన్ శేషారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ డా ఎన్ సతీష్ రెడ్డి, డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా ఎం శ్రీనివాస్ రెడ్డి, వైస్ ఛాన్సలర్ డా ఎంబి శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్ డా ఎస్ రమాశ్రీ, డా ఏ రమేష్, డా రవి తంగజన్, రిజిస్ట్రార్ డా జి సురేష్, స్కూల్ ఆఫ్ బిజినెస్ అసోసియేట్ డీన్ డా బి సౌజన్య మరియు వివిధ విభాగాల విభాగాధిపతులు, ఉపాధ్యాయ సిబ్బంది డా నిషా కుమారికి అభినందనలు తెలిపారు.

ఐరాస బృందంలో మిథున్‌రెడ్డి..!

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు సత్తిబాబు విస్మయం

విశాలాంధ్ర-అమలాపురం : లిక్కర్ స్కాం కేసులో జెయిల్‌పై ఉన్న వైసీపీ పార్లమెంట్ సభ్యుడు మిథున్ రెడ్డి విషయంలో రాష్ట్రం, కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వాలు చెరో విధానాన్ని అవలంభించడంపై సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కె సత్తిబాబు మండిపడ్డారు. ఐరాస వెళ్లే భారత్ బృందంలో ప్రతినిధుల బృందానికి ఎంపీ మిథున్ రెడ్డిని కేంద్రం ఎంపిక చేయడంపై ఆయన విస్మయాన్ని వ్యక్తం చేశారు. దీనినిబట్టి మిథున్‌రెడ్డి విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తలోదారిలో నడుస్తున్నాయనేది స్పష్టమవుతోందన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన కేసును కేంద్రం విస్మరించిందా.. లేక రాష్ట్ర ప్రభుత్వమే మిథున్‌రెడ్డిపై కేసును ఉపసంహరించుకుంటుందనా అని ప్రశ్నించారు.

ఘనంగా ప్రపంచ తపాలా దినోత్సవం

విశాలాంధ్ర-కాకినాడ రూరల్ : రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ తపాలా దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భ ంగా తపాలా శాఖ విశ్రాంతి ఉద్యోగి తురగా సూర్యారావు మాట్లాడుతూ తోక లేని పిట్టగా పేరొందిన ఉత్తరాల ద్వారా బంధువుల యోగక్షేమాలు తెలుసుకునేందుకు తపాలా శాఖ అమూల్యమైన సేవలను అందించిందన్నారు. ప్రజలకు తక్కువ ఖర్చుతో వేగవంతమైన సేవలు అందిస్తూ ప్రభుత్వ రంగ సంస్థలలో ముఖ్యమైనదిగా ప్రాచుర్యం పొందింద న్నారు. దేశ వ్యాప్తంగా నగరాల నుంచి మారుమూల గ్రామాలకు సైతం తపాలా శాఖ వ్యాప్తి చెందిందని అన్నారు. మొబైల్ ఫోన్లు అందుబాటులోకి రావడంతో ఉత్తరాలకు ఆదరణ తగ్గిందన్నారు. తపాలా శాఖ కూడా బ్యాం కింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తుందన్నారు. చిన్న మొత్తల పొదుపు పథకం తపాలా శాఖకు గుర్తింపు తెచ్చిందని సూర్యారావు తెలిపారు. ఈ సందర్భంగా అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో సూర్యారావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ శిరీష, చింతపల్లి సుబ్బారావు, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

డయాలసిస్ యూనిట్‌లు ప్రారంభించిన ఎమ్మెల్యే దేవ

విశాలాంధ్ర-రాజోలు: రాజోలు ఏరియా ఆసుపత్రి నందు కిడ్నీ బాధితుల సౌకర్యా ర్థం నిర్వహిస్తున్న డయాలసిస్ కేంద్రం నందు అదనంగా ఏర్పాటు చేసిన రెండు డయాలసిస్ యూనిట్లను రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మన ప్రాంతంలో కిడ్నీ బాధితుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతున్నాయన్నారు. ఈ డయాలసిస్ కేంద్రంలో రోజుకు మూడు షిఫ్ట్‌లు లెక్కన రోజుకి 15 సెషన్లు జరుగుతున్నాయి. ఇప్పుడు అదనంగా 2 యూనిట్లు యాడ్ అవడంతో సెషన్స్ 21 పెరిగి కిడ్నీ బాధితులకు ఉపయుక్తంగా ఉంటుం దన్నారు. దాదాపు 55 మంది డయాలసిస్ బాధితులు ఈ కేంద్రం నందు డయాలసిస్ చేయించుకొంటున్నారని తెలిపారు. తద్వారా మెడిసిన్, భీమా వంటి ఆరోగ్య సేవలను మరింత మెరుగ్గా పొందే అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజోలు టీడీపీ నియోజకవర్గ ఇంచార్జీ గొల్లపల్లి అమూల్య, ఎంపీపీ కదలి దుర్గా, ఏఎంసీ చైర్మన్ కేతా వెంకటలక్ష్మి, రాజోలు, తాటిపాక సర్పంచ్‌లు రేవు జ్యోతి,ఆసుపత్రి వైద్య సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

15న నుండి డిడియుజికెవై కేంద్రాల్లో నైపుణ్యాభివృద్ధి శిక్షణా తరగతులు

విశాలాంధ్ర-కాకినాడ : "వికాస" ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీ (బుధవారం) నుండి డిడియుజికెవై సెంటర్ వాకలపూడి, కాకినాడ నందు నైపుణ్యాభివృద్ధి శిక్షణా తరగతులు ప్రారంభమవుతున్నాయి. ఈ శిక్షణకు ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ, ఐటిఐ, డిప్లొమా, ఉత్తీర్ణులైన 18 నుండి 30సం.లలోపు పురుష అభ్యర్థులు అర్హులు. వేర్‌హౌస్ ఎగ్జిక్యూటివ్ కోర్సుకు 3 నెలలు శిక్షణ ఇచ్చి అనంతరం ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగం కల్పిస్తున్నారు. శిక్షణ అనంతరం సెంట్రల్ గవర్నమెంట్ ద్వారా సర్టిఫికెట్ ఇవ్వబడుతుంది. ఈ శిక్షణా సమయంలో ఉచిత భోజనం, వసతి, యూనిఫారమ్, స్టడీమెటీరియల్ అందించబడును. పై కోర్సులతో పాటు అదనంగా బేసిక్ కంప్యూటర్ కోర్సు, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 13వ తేదీ సోమవారం సాయంత్రం 5 గం.లోపు సెల్ నెంబర్లను 8328 4 83297, 8978475164 సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవలెను.

డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ఘన స్వాగతం

విశాలాంధ్ర - కాకినాడ : కాకి నాడ జిల్లా పర్యటన నిమిత్తం గురువారం ఉద యం కాకినాడ ఎస్పీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు జిల్లా అధికారులు ప్రజాప్రతి నిధులు, నాయకులు ఘన స్వాగతం పలికారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు కాకినాడ ఎంపీ తంగేళ్ల ఉదయ్ శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ షణ్మోహన్, జిల్లా ఎస్పీ బిందు మాధవ్, ప్రభుత్వ విప్‌లు దాట్ల సుబ్బరాజు, యనమల దివ్య, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, కాకినాడ పట్టణం ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వ రరావు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి, పౌర సరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, జెడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అను బాబు, పిఠాపురం జనసేన ఇన్చార్జి మర్రెడ్డి శ్రీని వాసు, డీఎస్పీ రామచంద్ర రావు పూల బొకేలు ఇచ్చి, దుస్సు శాలువాలతో స్వాగతం పలికారు. అనంతరం కాకినాడ కలెక్టరేట్‌లో ఉప్పాడ మత్స్య కార సోదరులతో మాట-మంతి కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు.

నేడు వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు

-10వ తేదీ నుంచి 18 వరకు బ్రహ్మోత్సవాలు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : ఆత్రేయపురం మండలం వాడపల్లి గ్రామంలో స్వయంభూగా వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి 13వ వార్షిక బ్రహ్మోత్సవములు సోమవారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు ప్రణాళికబద్దమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ ఈఓ యన్ఎస్ చక్రధర్ రావు తెలిపారు. ఈనెల 10వ తేదీన శేషవాహన సేవ, 11న హంసవాహనసేవ, 12న హనుమద్వాహ నసేవ, 13న సింహవాహన సేవ, 14న గరుడ,సేవ, 15ఉదయం సూర్యప్రభ వాహన సేవ సాయంత్రం చంద్రప్రభ వాహనం, 16న రాజాధిరాజ అలంకరణతో గజవాహనసేవ, 17 కల్ప వృక్ష వాహనసేవ, సాయంత్రం అశ్వవాహన సేవ జరుగుతాయి. 18న స్వామివారి చక్ర స్నానంతో ఉత్సవాలను ముగిస్తారు.

భక్తులకు అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేసాం : ఆలయ ఈఓ యన్ఎస్ చక్రధర్ రావు భక్తులకు అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ డిసియన్ఎస్ చక్రధర్ రావుతెలిపారు. స్వామివారి కళ్యాణోత్సవాల నిర్వహణపై ప్రణాళికాబద్ధమైన ముందస్తు అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించినట్లు చెప్పారు. కళ్యాణోత్సవాలకు భక్తుల సంఖ్య పెరగనున్న దష్ట్యా అంచనాకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ యన్ఎస్ చక్రధర్ తెలిపారు.

రాయవరం బాణాసంచా కేంద్రంలో అగ్నిప్రమాదం బాధాకరం

- **మృతుల కుటుంబాలకు 50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి**
- **గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలి**
- **సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు డిమాండ్**

విశాలాంధ్ర - అమలాపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం రాయవరం గ్రామంలో శ్రీ గణపతి ఫైర్ వర్క్స్‌లో నిన్న జరిగిన అగ్ని ప్రమాదం చాలా దురదృష్టకరమని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం సిపిఎం పార్టీ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కమిటీ బృందం ఆధ్వర్యంలో ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలన చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ ఈ ఫైర్ వర్క్స్‌లో మొత్తం 50 మంది వర్కర్లు పనిచేస్తుండగా 35 మంది మాత్రమే ప్రమాదం జరిగిన రోజు విధులకు హాజరయ్యారని, భోజన విరామ సమయంలో ఈ ప్రమాదం జరగడంతో మరణాల తీవ్రత తగ్గిందన్నారు. ప్రమాదం జరిగినటువంటి చోట నీటిని పుష్కలంగా నిలవ చెయ్యాలి. అగ్నిమాపక చర్యలు ముందస్తుగా ఏర్పాటు చేసుకొని ఉండాలి, వాటర్ రాకపోవడంతో నీళ్లు లేని పరిస్థితి ఈ ప్రమాదం మరింత తీవ్రతరంగా మారింది. అందుచేత ఎక్కువమంది మరణించడానికి ఈ పరిస్థితి దారి తీసింది అయన వాపోయారు. సీపీఎం పార్టీగా మృతులు కుటుంబాలకు 50 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషన్ ఇవ్వాలని, మెరుగైన వైద్యం అందించాలని, క్షతగాత్రుల కుటుంబాలకు 5 లక్షల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ మండలంలో పలుచోట్ల ఫైర్ వర్క్స్ ఉన్నట్టు మా బృందం గమనించింది. అధికారులు తక్షణం ఈ ఫైర్ వర్క్స్ ఉన్న ప్రాంతాలను తనిఖీ చేసి ఏర్పాట్లపై సమీక్ష చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు. ఈ పర్యటనలో సిపిఎం పార్టీ జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, జిల్లా సభ్యులు జి దుర్గాప్రసాద్, ఎం బలరాం, సిపిఎం జిల్లా సీనియర్ నాయకుడు కొప్పూరు సత్తిరెడ్డి, ప్రజా సంఘాల నాయకులు, సిఐటియు మండల కన్వీనర్ డి ఆదిలక్ష్మి, అంగన్వాడి నాయకురాలు ఎస్ కృష్ణకుమారి, ఎం కమల, శ్రీ సత్య మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కే నరేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దీపావళి మందుగుండు సామాగ్రి స్వాధీనం

విశాలాంధ్ర-కడియం : కడియం మండలం, కడియపులంక గ్రామంలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు రూ.2,51,000లు విలువచేసే దీపావళి మందుగుండు సామాగ్రిని స్వాధీన పరుచుకుని ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు కడియం సిఐ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడియపు లంక గ్రామానికి చెందిన గెల్లి వెంకటేశ్వరరావు, గ్రంధి శ్రీరామచంద్రమూర్తి, బలభద్రుని నాగవీర సూర్య ప్రకాష్‌లకు సంబంధించిన మూడు వేరువేరు ప్రాంతాలలో బాణాసంచా నిల్వలు ఉన్నాయంటూ వచ్చిన సమాచారం మేరకు, మహిళా ఎస్సై ధనలక్ష్మి ప్రసన్న ఆధ్వర్యంలో స్టేషన్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. మండలంలో ఎవరైనా అక్రమంగా ఏవిధమైన అనుమతులు లేకుండా బాణాసంచా సామాగ్రి ని నిల్వ ఉంచినా, అమ్మడం చేసినా పోలీసువారు తీసుకునే క్రిమినల్ చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు.

రాబోయే పుష్కరాలకు యానాంలో ముందస్తు ఏర్పాట్లు పరిశీలన

విశాలాంధ్ర-యానాం : యానాం, ఉభయ గోదావరి జిల్లాలు, కేంద్ర పాలిత ప్రాంతం యానాంలో 2027లో జరిగే అతిపెద్ద ఆధ్యాత్మిక ఉత్సవమైన గోదావరి పుష్కరాలు కోసం స్నానఘట్టాలు సిద్ధం చేసే ప్రక్రియకు పుదుచ్చేరి ప్రభుత్వం ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. 2015 పుష్కరాలకు యానాంలో 5స్నాన ఘట్టాలు మాత్రమే ఉండగా రోజుకు ఒకటిన్నర లక్షల మంది భక్తులు పుణ్య స్నానాలకు వచ్చారు. వీరి సంఖ్య మరో రెండు రెట్లు పెరిగినా తట్టుకొనే విధంగా స్నానఘట్టాలు ఆధునీకరించాలని, కనకలపేట నుంచి సావిత్రనగర్ వరకు మొత్తం 18 స్నానఘట్టాలు సిద్ధం చెయ్యనున్నారు. కార్తీక స్నానాలు, అయ్యప్ప, భవాని భక్తులు, అన్ని మతాలకు సంబంధించిన కార్యక్రమాలు జరుపుకునేలా స్నానఘట్టాల వద్ద ఏర్పాట్లు చెయ్యాలని మల్లాడి సూచించారు. యానాం పరిపాలనాధికారి అంకిత్ కుమార్, ప్రజాపనుల శాఖ ఇంచార్జి కాళహస్తి జ్యోతిరాజు, జేఈలు ఆధ్వర్యంలో ఎక్కడెక్కడ స్నాన ఘట్టాలు ఏర్పాటు చేయాలని అంశాలపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ పుష్కరాలకు ఏర్పాటు చేస్తే ఈ స్నాన ఘట్టాలు మరో 25 సంవత్సరాలు పాటు చెక్కుచెదరకుండా ఉండేలా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. మరోపక్క నూతన ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలల వరకు ఓటన్ అకౌంట్ బడ్జెట్ ప్రతిపాదన తప్ప ఎటువంటి నిధులు కేటాయింపు జరిగే అవకాశం లేనందున ముందస్తుగానే ప్రభుత్వానికి వినతి పత్రాలు ఇచ్చి ఈ ప్రతిపాదనను సిద్ధం చేయడం జరుగుతుందని తెలియజేశారు. ప్రభుత్వానికి విన్నవిచ్చిన నేపథ్యంలోనే టెంటేటివ్ ఎస్టిమేషన్‌తో రావాలని చెప్పిన నేపథ్యంలోనే ఈ ప్రతిపాదనలు సిద్ధం చేయడం జరుగుతుంది. ఢిల్లీ ప్రతినిధి మల్లాడి తెలిపారు.

అగ్నిప్రమాద ఘటన పై పితాని బాలకృష్ణ దిగ్భ్రాంతి

బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్

విశాలాంధ్ర-కాట్రేనికోన:మండపేట నియోజకవర్గం రాయవరం మండలం, కొమరిపాలెం గ్రామంలోని బాణాసంచా తయారీ కేంద్రంలో బుధవారం జరిగిన అగ్ని ప్రమాద ఘటన పట్ల వైసీపీ రాష్ట్ర సెంట్రల్ ఎక్జిక్యూటివ్ కౌన్సిల్ (సీఈసీ) సభ్యులు పితాని బాలకృష్ణ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన ఏడుగురికి ఆయన సంతాపం వ్యక్తం చేశారు. నిరుపేదలైన మృతుల కుటుంబాలకు కోటి రూపాయలు చొప్పున నష్ట పరిహారం చెల్లించాలని ఆయన గురువారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే ఘటనలో గాయపడిన వారికి నష్టపరిహారాన్ని ప్రకటించాలని కోరారు. అగ్ని ప్రమాద బాధితులకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని బాలకృష్ణ డిమాండ్ చేశారు. గాయపడిన బాధితులు త్వరితగతిన కోలుకోవాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు బాలకృష్ణ తెలిపారు.

పెద్దేవంలో గేదెల ఆకస్మిక మరణాలపై పరిశీలన

- నివారణ చర్యలు ప్రారంభం : కలెక్టర్ కీర్తి చేకూరి

విశాలాంధ్ర-తాళ్లపూడి / తూర్పుగోదావరి : తూర్పు గోదావరి జిల్లా తాళ్లపూడి మండలం పెద్దేవం గ్రామంలో గేదెల ఆకస్మిక మరణాల ఘటనపై జిల్లా యంత్రాంగం సమగ్ర పరిశీలన చేపట్టినట్లు , పశు సంవర్ధక శాఖ నిపుణుల బృందాలు గ్రామంలో స్థల పరిశీలన నిర్వహించి, నమూనాలను సేకరించి ప్రయోగశాలల పరిశీలనకు పంపినట్లు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక నివేదికల ప్రకారం, పరాన్నజీవి వ్యాధులు మరియు వైరల్ ఇన్ఫెక్షన్‌ల సమ్మేళనమే ప్రధాన కారణంగా గుర్తించబడిందని, బాధిత పశువులకు అవసరమైన వైద్య సహాయం, డీవార్మింగ్ మరియు కీటక నియంత్రణ చర్యలు తక్షణమే ప్రారంభించబడినట్లు ఆమె తెలిపారు. గ్రామంలోని పశువులందరికీ ఉచిత వైద్యం, సలహాలు అందించేందుకు మొబైల్ వెటర్నరీ టీమ్‌లను పంపినట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు పశుసంవర్ధక శాఖ పర్యవేక్షణను బలోపేతం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. రైతులు తమ పశువుల్లో ఏవైనా అనారోగ్య లక్షణాలు గమనించిన వెంటనే సమీప వెటర్నరీ వైద్యుడు లేదా గ్రామ సచివాలయ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. జిల్లా యంత్రాంగం పశువుల ఆరోగ్య రక్షణ, రైతుల ఆర్థిక భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ ప్రభుత్వానికి తగిన సిఫారసులు పంపిందని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. పశువుల పెంపకందారులు చెరువులు, బురద ప్రాంతాల్లో పశువులను మేపవద్దని, గొర్రెలు%-మేకలతో కలిపి మేపకుండా జాగ్రత్తలు పాటించాలని జిల్లా పశుసంవర్ధక అధికారి టి. శ్రీనివాస్ రైతులకు సూచించారు. డీవార్మింగ్, టీకాలు, కీటక నియంత్రణ కార్యక్రమాలను నిరంతరంగా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. తాళ్లపూడి మండలం పెద్దేవం గ్రామంలో అనారోగ్యంతో మృత్యువాతపడుతున్న గేదెల జబ్బును గుర్తించేం దుకు వీలుగా ఇంకొన్ని అనుమానాల నివృత్తికి పేడ, మూత్రం టెస్టులు చేయించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ మేరకు 50 మందికి పైగా రైతుల హాజరయి తమ గేదెల పేడ పరీక్షలు చేయగా 90 శాతం గేదెలలో జలగ వ్యాధి ఉన్నట్లు గుర్తించి నట్లు పశు సంవర్ధక శాఖ డిడి డా.సత్యనారాయణ పేర్కొ న్నారు. గురువారం ఆయన అద్వర్యం లో మరొక సారీ వైద్యుల బృందం పెద్దేవంలో పర్యటించింది. ముఖ్యంగా గేదెలకు ప్రభుత్వ ఇన్సూరెన్స్ పథకం అమలులో లేనందున ప్రవేట్ కంపీని ఇన్సూరెన్స్ అయినా సరే తీసుకుంటే నష్ట నివారణగా ఉంటుందని కంపెనీ ప్రతినిధులను రైతులకు పరిచయం చేశారు. కాగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకుఅప్పట్లోనే మృత్యువాత పడ్డ ఒక గేదెకు పోస్ట్ మార్టం నిర్వహించి, జరిపిన పరీక్షల్లో రెండు వైరస్ లు గుర్తించినట్లు, అలాగే చెరువు నీటిలో పేరా ఘాట్ పోయిజినింగ్ అవశేషాలు ఉన్నట్లు తేలిందని, అవి ప్రమాద కరమని, గేదెలలో వ్యాధి నిరోధక శక్తి నశించి, మిగతా వైరల్ రోగాల పెరుగుదలకు అవకాశం ఇస్తోందని అన్నారు. మిగతా మిశ్రమ రోగాల నివారణకు అప్పటినుంచి నివారణ మందులు కూడా వాడు తున్నామని వాటి ఫలితాలు ఒకటి ఒకటిగా కనబడు తున్నాయన్నారు. కొవ్వూరు ఆర్డీవో దృష్టిలో పెట్టగా, చెరువులోకి ఏ దూడలు, జంతువులు వెళ్ల కుండా రక్షణ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్డీవో రాణి శుష్మిత తెలిపారని అన్నారు. నష్టపరిహారం ఇవ్వాల్సిందే ఇదే సందర్భం లో గ్రామ ఉప సర్పంచ్ తోట రామకృష్ణ మాట్లాడుతూ, ప్రతి రైతు పేరా ఘాట్ పాయిజన్ పొలాల్లో వాడతారని దీనివల్ల గేదెలు

రోగాలు వచ్చాయనటం ఆశ్చర్యంగా ఉందని, గేదెలకు వచ్చిన రోగ నిర్ధారణ చేసి, సరైన మందు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గేదెలు కోల్పోయిన వారికి తక్షణ నష్ట పరిహారం ఇవ్వాలని అన్నారు. పశు శాఖ వైద్యులు వైద్యం చేస్తున్నప్పటికి, తమ గ్రామంలో రైతులకు సంతృప్తి కాదని తెలిపారు. పశు సంవర్ధక శాఖడి.డి. డా.ఎస్. సత్యనారాయణ, ఏ.డి డా.ఏ.వెంకట రెడ్డి, కాకినాడ లాబ్ కి చెందిన డా.సందీప్, డా.ఎస్.వెంకటేశ్వరరావు, తాళ్లపూడి మండల డా.వర లక్ష్మీ, డా.బాలాజీ హాజరయ్యారు.

గేదెల పై విష ప్రయోగమా?

గ్రామం లో ఒక రైతు గేదె మెడపై ఒక సిరంజిని గుర్తు తెలియని వారెవరో గుచ్చారని, అవి పశు శాఖ వైద్యులు వాడేవి కాదని, సిరంజీ లో పచ్చని మందు ఉందని, అది విషంగా పేరా ఘాట్ ముందుగా ఉందని, గేదెలకు కావాలని విషాన్ని ఎక్కిస్తున్నారని ఓ మహిళ రైతు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అలాగే సూది గుచ్చివున్న ప్రాంతం లోనే మచ్చ వచ్చిందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అంతే కాక జరిగిన సంఘటనలన్నిటిలో విష ప్రయోగం జరిగిందా అని అనుమానాలు వ్యక్త మవుతున్నాయి. లాబ్ రిపోర్ట్ లో పారా ఘాట్ విష అవశేషాలు ఉన్నాయన్న సమాచారం కూడా బలం చేకూర్చుతుంది. ఆ సిరంజిని అధికారులు స్వాధీనం పరచుకున్నట్టు సమాచారం. పోలీస్ వ్యవస్థ విచారణ కూడా గేదెల మృత్యువాత సంఘటనల్లో అవసరమని వెల్లడవుతోంది. రైతులు మాత్రం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉపముఖ్యమంత్రిని కలిసిన కలెక్టర్

విశాలాంధ్ర-తూర్పుగోదావరి: రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ కాకినాడ జిల్లా పర్యటనలో భాగంగా గురువారం ఉదయం మధుర పూడి (రాజమండ్రి) విమానాశ్రయానికి చేరుకున్నారు. తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి విమానాశ్రయంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసి స్వాగతం పలికారు.

పేపర్ మిల్‌లో వేతన ఒప్పందం వెంటనే చేయండి

- వేతన ఒప్పందం అనంతరం ఎన్నికలు నిర్వహించండి
- కార్మిక శాఖ కమిషనర్ ను కలిసి కోరిన ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు

విశాలాంధ్ర-కడియం: తూర్పు గోదావరి జిల్లా కడియం పేపర్ మిల్ లో నూతన వేతన ఒప్పందం వెంటనే చేయాలని ఒప్పందం తరువాత మాత్రమే ఎన్నికలు నిర్వహించాలని ఏఐటీయూసీ ఉపాధ్యక్షులు తాటిపాక మధు కోరారు. గురువారం ఉదయం స్థానిక సీతారామపురంలో కార్మిక శాఖ కార్యాలయంలో కార్మిక శాఖ కమిష నర్ ఎం వి శేషగిరి బాబును జేఏసీ యూనియన్ నాయకులు అప్పారావు, రాజ బాబు, నాయుడు, పల్లి ప్రసాద్, బి శ్రీనువాస్, చిన్నారావు, బి రాజు రమణ రావు, ఏఐటీయూసీ జాతీయ సమితి సభ్యులు తోకల ప్రసాద్, తాతయ్య తదితరులు కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం యూనియన్ నాయ కులు మాట్లాడుతూ ప్రస్తుతం మా కడియం పేపర్ మిల్లు యాజమాన్యం తో వేతన ఒప్పందం చర్చలు జరుగుతున్నాయని వేతన ఒప్పందం పూర్తయ్యేవరకు ఎన్నికలు వాయిదా వేయాలని ఒప్పందం జరిగిన వెంటనే ఎన్నికలు నిర్వహించాలని కడియం పేపర్ మిల్ ఐక్యకార్యాచరణ కమిటీ కోరింది. కార్మికులకు మంచి వేతన ఒప్పందం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఐక్యకార్యాచరణ కమిటీ నాయకులు తెలిపారు.

రాజమండ్రి మున్సిపల్ కమిషనర్ నియామకం

విశాలాంధ్ర-రాజమండ్రి: మూడురోజుల క్రితం రాజమండ్రి కమిషనర్‌ను నియమించాలని సీపీఐ ఏఐటీయూసీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆందోళన చేసిన విషయం తెలిసి ందే గురువారం కమిషనర్‌గా కాకినాడ జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రానున్న గోదావరి పుష్కరాలు నేపథ్యంలో కమిషన ర్‌ను నియమించడాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు స్వాగతించారు.

బాణాసంచా అక్రమ తయారీదారులను ఉపేక్షించేది లేదు : ఎస్పీ కిషోర్

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : జిల్లాల అనుమతులు లేకుండా అక్రమ బాణాసంచా తయారీ గాని నిల్వలు గాని విక్రయాలు గాని జరిగితే ఉపేక్షించే ప్రసక్తే లేదని జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ హెచ్చరించారు. రానున్న దీపావళి పండుగ నేపథ్యంలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ప్రజలకు ఆయన పలు సూచనలు చేశారు. దీపావళి పండుగను పురస్కరించుకొని ఆక్రమ మార్గంలో ధనం ఆర్జించేందుకు ఎవరైనా అక్రమంగా అనుమతులు లేకుండా బాణసంచా తయారు చేయడం గానీ నిల్వ చేయడం గానీ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గత ఏడాది ఏలూరు జిల్లా కేంద్రమైన ఏలూరులో జరిగిన ఒక ఘోర సంఘటనను గుర్తు చేశారు. స్థానిక వన్ టౌన్ ప్రాంతంలో ఒక వ్యక్తి ద్విచక్ర వాహనంపై ఉల్లిపాయలు బాంబులను వడిలో పెట్టుకొని ప్రయాణం చేయడం వల్ల భారీ విస్ఫోటనం జరిగి ప్రాణాలు కోల్పోయిన విషయాన్ని ప్రజలు గమనించాలని చెప్పారు. పండుగను ప్రజలందరూ ఆనందంగా జరుపుకోవాలని, పండగను పురస్కరించుకొని ప్రజలకు ఎటువంటి ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎవరైనా అక్రమ బాణసంచా తయారీ కేంద్రాలను గాని అమ్మకాలను చేస్తే డయల్ 112 కు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్పీ స్పష్టం చేశారు.

దళితులను దగా చేసిన చరిత్ర జగన్ కే సొంతం : ఎమ్మెల్యే రోషన్



విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : దళితులను దగా చేసిన చరిత్ర మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి సొంతమంటూ చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ తీవ్రస్థాయిలో విమర్శించారు. అదే అహంకారాన్ని కొనసాగిస్తూ చిత్తూరు జిల్లా దేవకుప్పం మండలం దేవరపట్నం గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి సైతం నిప్పుపెట్టిన సంస్కృతి సైతం వైసిపి నాయకులదేనని ధ్వజమెత్తారు. ఇదే అంశంపై గురువారం ఏలూరులో దళితనేతలు కదంతొక్కారు. తొలుత ఈ కార్యక్రమానికి ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి తన సంఘీభావం తెలిపారు. స్థానిక పవర్‌పేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి ర్యాలీగా పాతబస్టాండ్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్, రాష్ట్ర మాలల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు మాట్లాడుతూ వైసిపి హయాంలో దళితుల్ని అవమానించి, అణచి వేయాలని అనుకోవడం నిజంకాదా అని ప్రశ్నించారు. నాయకులు ఉన్నమట్ల సునీత, జిల్లా క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు జుంజు మోసెస్, కార్పొరేటర్ తంగిరాల అరుణా సురేష్, ఎస్సీ సెల్ నాయకులు పెద్దపూడి లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బోధనేతర కార్యక్రమాలు బహిష్కరణ: ఫ్యాప్టో



విశాలాంధ్ర -భీమవరం: జిల్లాలో నేటి నుంచి (శుక్రవారం) బోధనేతర కార్యక్రమాలు బహిష్కరిస్తున్నట్లు ఫ్యాప్టో నాయకులు ప్రకటించారు. ఫ్యాప్టో రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా గురువారం నాయకులు జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఇఓ నారాయణకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బోధనేతర కార్యక్రమాలతో బోధన సమయం హరించుకుపోతున్నదని, ఉపాధ్యాయులకు కూడా బోధనపై ఆసక్తి తగ్గిపోయే విధంగా బోధ నేతర కార్యక్రమాలు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. పలుదఫాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన, ఏమాత్రం పట్టించుకోనందున శుక్రవారం నుండి బోధ నేతర కార్యక్రమాలను బహిష్కరిస్తున్నామని తెలిపారు. మూల్యాంకానికి సంబంధిం చిన పరీక్ష నిర్వహణ తప్ప ఏ ఇతర బోధనా పనులు గాని, అనవసరమైన గూగుల్ షీట్స్ నింపడం గాని, విద్యాశక్తి , జీఎస్టీ 2.0 లాంటి ప్రచార కార్యక్రమాలను గాని చేపట్టబోమని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఫ్యాప్టో చైర్మన్ విజయరామ రాజు, సెక్రటరీ జనరల్ జి.ప్రకాశం, ఫ్యాప్టో కో- చైర్మన్లు పి.సాయి వర్మ, శ్రీనివాస్రావు, వెంకటేశ్వరరావు, డెప్యూటీ సెక్రెటరీ జనరల్ రమణపాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో పేదలకు ఆర్థిక మేలు



విశాలాంధ్ర - ఏలూరు : జీఎస్టీ 2.0తో పేదలకు ఎన్డీయే ప్రభుత్వం మరిన్ని ఆర్థిక మేళ్ళను చేకూర్చి పెట్టిందని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి స్పష్టం చేశారు. గురువారం ఏలూరు నగరంలో చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్‌తో కలిసి ఆయన కేంద్రం జీఎస్టీలో నూతనంగా తీసుకొచ్చిన సంస్కరణలపై ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎస్టీ రెండు స్లాబుల విధానంపై రూపొందించిన కరపత్రాలను ప్రజలకు అందించి, దానిద్వారా కలిగే లబ్దిని వారికి వివరించారు. ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ పేదలకు ఆర్థిక ప్రయోజనాలను కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో జీఎస్టీ అవగాహన సదస్సు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : మానవుని జీవిత ఆరోగ్యాన్ని కాపాడడంలో ప్రముఖ పాత్ర వహిస్తున్న మందుల పై జీఎస్టీ ధరలు తగ్గాయని జంగారెడ్డిగూడెం డివిజనల్ ఔషధ తనిఖీ అధికారి అబిద్ అలీ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో కెమిస్ట్ %డ% డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఔషధాలపై జిఎస్టి ధరలు తగ్గడంతో ఆసుపత్రిలోని సిబ్బందికి రోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ మద్దు. ప్రసాద్, మొటమర్రి ఉమామహేశ్వరరావు, గుడిమెట్ల గంగాధరం, నిమ్మగడ్డ శ్రీను, బొమ్మ సూరిబాబు, జి శ్రీను, సత్యనారాయణ, రమణ, సతీష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల వేలం పాట

విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం ఆర్టీవో కార్యాలయ పరిధిలో రవాణా శాఖ ద్వారా నిర్బంధించిన రవాణా ,రవాణేతర వాహనాలకు ఈ నెల 22వ తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఉప రవాణా కమిషనరు షేక్ కరీమ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలంలో 3 గూడ్స్ క్యారియర్లు, 1 మ్యాక్సీ క్యాబ్, 3 ట్రాక్టర్లు, 9 మోటార్ సైకిల్స్ ఉన్నట్లు తెలిపారు. ఈ వేలాన్ని జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపోలోనిర్వహిస్తారని, 5వేలు చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

ప్రణాళికతో పనిచేస్తేనే అభివృద్ధి

విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం: గ్రామాల అభివృద్ధికి ప్రణాళికబద్దంగా గ్రామపంచాయతీ సర్పంచులు ఎంపీటీసీలు పనిచేయాలని ఎంపీడీవో టిఆర్ఎస్ కృష్ణ ప్రసాద్ అన్నారు .ఎంపీడీవో కార్యాలయంలో గ్రామపంచాయతీ సర్పంచులకు డివిజన్ స్థాయిలో స్థానిక సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై బుధ గురువారాల్లో రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో గ్రామ పంచాయతీల సర్పంచ్ లు కీలకపాత్ర వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం జడ్పిటిసి సభ్యుడు పోలనాటి బాబ్జి, జంగారెడ్డిగూడెం , కామవరపుకోట మండలాల ఎంపీపీలు సర్పంచులు కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతుల సౌకర్యార్థం నూతన కాటా ఏర్పాటు

విశాలాంధ్ర- టి నరసాపురం : ఫామ్ ఆయిల్ రైతుల సౌకర్యం కోసం నూతన కాటా ఏర్పాటు చేసినట్లు నవ భారత్ కంపెనీ డిజిఎం రాజ గోపాల్ తెలిపారు. మర్రి గూడెం గ్రామంలో నవ భారత్ కంపెనీ ఆధ్వర్యంలో కోటి రూపాయల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన ఫామ్ ఆయిల్ కాటాను జంగారెడ్డిగూడెం ఏరియా నవ భారత్ ఆయిల్ ఫాం రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు, మక్కినవారిగూడెం సొసైటీ ఛైర్మన్ పర్సన్ ఆచంట సూర్యనారా యణ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజ గోపాల్ మాట్లాడుతూ మర్రి గూడెం, మక్కినవారిగూడెం, బండి వారి గూడెం పంచాయతీ ల్లోని రైతులకు మేలు జరుగుతుందని ఆయన తెలిపారు. ఫామ్ ఆయిల్ కాటా ఏర్పాటుతో నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో గెడా శ్రీధర్, ఆలపాటి పాపారావు, పిన్నమనేని రాము,పొట్టా రామారావు, పూనెం ఆదిత్య, బలుసు వేణు, కాకర్ల మోహన్, కొయ్యమూడి పార్థ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ వేలం ప్రకటన

విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల వివిధ ఎక్సైజ్ నేరములలో పట్టుబడిన 15 వాహనములను జంగారెడ్డిగూడెం ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ నందు ఈ నెల 10వ తేదీన బహిరంగ వేలం వేయడం జరుగుతుందని జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ తెలిపారు. ఈ వేలం లో పాల్గొనదలచిన వారు ముందుగా ధరావతుని చెల్లించి వేలంపాట లో పాల్గొన వలెనని, వేలం పాటలో వాహనం ను దక్కించుకున్న వారు సొమ్మును వెంటనే చెల్లించాలని ,పాడిన ధరకు అదనముగా జీఎస్టీ టాక్స్ ను కూడా చెల్లించవలసి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలను తెలుసుకొనుటకు ప్రొహిబిషన్ , ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ 9618521855,మరియు సబ్ ఇన్స్పెక్టర్ 9963463363 నెంబర్లను సంప్రదించగలరని ఆయన తెలిపారు.

జీపీఎఫ్, పెన్షన్ కేసులు పరిష్కరించుకోండి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర - భీమవరం : ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు జిపిఎఫ్, పెన్షన్ కేసుల పరిష్కారానికి అంది వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం కలెక్టరేట్ పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో వివిధ శాఖల డిడిఓలకు రాష్ట్రస్థాయి అధికారులతో ఏర్పాటుచేసిన పెన్షన్, జిపిఎఫ్ కేసుల సమీక్ష సమావేశానికి ఏ.పి ప్రిన్సిపల్ అకౌంట్ జనరల్ ఎస్.శాంతి ప్రియ, సీనియర్ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ ఎస్.కౌశల్ కార్తీక్, డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ మిస్.ఎన్.ఆశ్రిత పట్నాయక్, రాష్ట్ర ఖజానా మరియు లెక్కల అధికారి డా.ఎన్.మోహన రావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏ.పి ప్రిన్సిపల్ అకౌంట్ జనరల్ ఎస్.శాంతి ప్రియ మాట్లాడుతూ అకౌంటింగ్, బిల్స్ కు సంబంధించిన అన్ని విషయాలలో డిడివోలు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. బిల్స్ సమ ర్పించేటప్పుడు ప్రొసీజర్ ప్రకారం విధిగా సమర్పించాలన్నారు. ప్రభు త్వ వ్యయం నిర్వ హణలో డిడివోలు మొదటి వరుస జవాబుదారీతనం కలిగి ఉంటారన్నారు. అలాగే కార్యా లయాలు, ట్రెజరీలు, అకౌంటెంట్ జనరల్ కార్యాలయాల మధ్య డిడివోలు కీల కంగా ఉంటారు అన్నారు. రాష్ట్ర ఏజి కార్యాలయం గ్రాస్ రూట్స్‌లో అకౌంటింగ్‌ను బలోపేతం చేయడం అనే బ్రోచర్‌ను డ్రాయింగ్, డిస్బర్సింగ్ ఆఫీసర్లు ఆర్థిక నిర్వహణలో వారి కీలక పాత్ర గురించి వారికి అవ గాహన కల్పించడం లక్ష్యంగా బుక్ లెట్ ను రూపొందించామన్నారు. చట్టబద్ధమైన తగ్గింపులపై తగ్గింపులపై ముఖ్యమైన మార్గదర్శకాలను ఉదహ రించామన్నారు. దీని ద్వారా రోజు రోజు వారి ఆర్థిక లావా దేవీలు నిర్వ హణ, ఆడిట్ లోపాలను సరిదిద్దు కోవడానికి ఉప యోగంగా ఉంటుందన్నారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లా డుతూ జిల్లాలో ఈ కార్యక్రమం నిర్వహించడం ద్వారా సర్వీసులో ఉన్న ఉద్యోగులకు, విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ఇటు వంటి కార్యక్రమాన్ని పశ్చిమగోదావరి జిల్లాను ఎంపిక చేసిన నిర్వహించడం చాలా ఆనందించదగిన విషయం అన్నారు. జిల్లాలోని డీడీవోలు ఈ అవకాశం సద్విని యోగం చేసుకోవాలన్నారు. రేపు అక్టోబర్ 10వ తేదిన ఎస్.ఆర్.కె.ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఆడి టోరియంలో నిర్వహించే "పెన్షన్ అదాలత్" ను డిడివోలు, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు సద్విని యోగం చేసుకొని కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని కోరారు. "గ్రాస్ రూట్స్‌లో అకౌం టింగ్‌ను బలోపేతం చేయడం అనే బ్రోచర్‌ను డ్రాయింగ్, డిస్బర్సింగ్ ఆఫీసర్లు ఆర్థిక నిర్వహణలో వారి కీలక పాత్ర" పై రూపొందించిన బుక్లెట్ ను ఏ.పి ప్రిన్సిపల్ అకౌంట్ జనరల్ ఎస్.శాంతి ప్రియ, కలెక్టర్ చదలవాడ నాగరాణి, తదితరులు ఆవిష్కరించారు. కార్యక్రమం లో సీనియర్ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ ఎస్.కౌశల్ కార్తీక్, డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ మిస్.ఎన్.ఆశ్రిత పట్నాయక్, రాష్ట్ర ఖజానా మరియు లెక్కల అధికారి డా.ఎన్.మోహన రావు, ఏ.జి కార్యాలయం సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు టి.విజయ కుమార్, ఎస్. బాలాజీ, కే.లక్ష్మి విజయ దుర్గ, ఎస్.నాగ మురళి, జిల్లా రెవిన్యూ అధికారి బి. శివ న్నారాయణ రెడ్డి, జిల్లా ఖజానా అధికారి మహ్మద్ మల్లూర్ బేగ్, జిల్లా ఆడిట్ అధికారి ఎస్. మధు బాబు, అసిస్టెంట్ అకౌంట్ ఆఫీసర్లు కే.ఆశిష్, అరుణ్ వ్యాసరాజు, ఎస్.కే.జకీర్, ఎం.నరేంద్ర, అఫ్సర్, సుమని, కే సందీప్, పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించాలి

విశాలాంధ్ర - కలిదిండి : గ్రామాలలో పారిశుద్ధ్య పనులను సక్రమంగా నిర్వహించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆర్ ఫణీంద్ర పంచాయతీల కార్యదర్శులకు సూచించారు. గురువారం మండలంలోని కోరుకొల్లు గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య పనులు చెత్త సేకరణ డ్రైనేజీ క్లీనింగ్ పనులను పరిశీలించారు. ఎస్సీ బాలికల వసతి గృహం తనిఖీ చేశారు. వసతి గ్రహంలో ఉన్న విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం సంతోషపురం నుండి పెదలంక వరకు గల మంచినీటి కాలువను పర్యవేక్షించారు. కాలువ లోనికి చెత్త మరియు మురుగునీరు రాకుండా చర్యలు తీసుకొనుటకు ఇరిగేషన్ సిబ్బందినీ, ఆర్డబ్ల్యూఎస్ సిబ్బందినీ, పంచాయతీ సెక్రెటరీలకు ఆదేశములు జారీ చేశారు. కాలువ గట్లపై చెత్త వేయుట నిషేధించుటకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయమని తెలిపారు. మురుగునీరు కాలువలోనికి రాకుండా ఇం కుడు గుంటలను ఉపయోగించమని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలిదిండి నీటి సంఘం అధ్యక్షులు ముద్దం. భోగేశ్వరరావు, ఆర్డబ్ల్యూఎస్ సిబ్బంది, ఇరిగేషన్ సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

లైసెన్సులు లేకుండా టపాసులు అమ్మితే చర్యలు తప్పవు : సీఐ

విశాలాంధ్ర - గణపవరం: లైసెన్సులు లేకుండా దీపావళి మందు గుండు సామగ్రి అమ్మిన అక్రమ నిల్వలు ఉంచిన వారిపై చట్టపరమైన చర్యలు తీసు కుంటామని నిడమర్రు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ నక్కా రజినీ కుమార్ అన్నారు. గురువారం దీపావళి పండుగ సందర్భంగా గణపవరం మండలం పిప్పర గ్రామంలోని భాగ్యలక్ష్మి క్రాకర్స్ ఎల్ ఈ 5 ఎల్ ఈ 3 ముందు గుండు అమ్మే షాపులను సిఐ,ఎస్ఐ అత్తిలి అగ్నిమాపక అధికారి వారు (తనిఖీలు) జాయింట్ ఇన్స్పెక్షన్ చేయడమైనది. ముందులు అమ్మేటప్పుడు ఏ విధమైన సంఘటనలో జరగకుండా ఫైల్ సేఫ్టీ ఇసుక తదితర భద్రత ఏర్పాటు చేయాలని షాపు యజమానులకు పోలీస్ ఫైర్ సిబ్బంది సూచనలు సలహాలు ఇచ్చారు ఈ కార్యక్రమంలో గణపవరం ఎస్ఐ ఏ మణికుమార్, అత్తిలి అగ్నిమాపక అధికారి గంగరాజు పోలీస్ ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన జంగారెడ్డిగూడెం విద్యార్థినులు

విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం : స్కూల్ గేమ్స్ అండ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వీరవాసరంలో నిర్వహించిన జిల్లాస్థాయి ఫెన్సింగ్ పోటీలలో జంగారెడ్డి గూడెం బాయ్స్ హైస్కూల్‌కి చెం దిన తొమ్మిదో తరగతి చెందిన కొప్పుల కీర్తన అండర్ 17లో , ఏడవ తరగతికి చెం దిన గణపవరపు సాయి ధాత్రి అండర్ 14 కేట గిరీలలో రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన సభలో ప్రధా నోపా ధ్యాయులు శ్రీ పి సోమశేఖర్ మాట్లాడుతూ ఈ డివిజన్ నుండి ఫెన్సింగ్ పోటీలలో మొట్టమొదట "సారిగా తమ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించటం చాలా ఆనందంగా ఉందని ,వీరికి తమ ఫిజికల్ డైరెక్టర్స్ ద్వారా మరింత మెరుగైన శిక్షణ ఇప్పించి జాతీయస్థాయి లో రాణించే విధంగా కృషి చేస్తానని ,ఈ సందర్భంగా వీరికి శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్స్ భూదేవి, కామేశ్వరీ లను ఆయన అభినందించారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ శ్రీ చిక్కాల సత్యనారాయణ పిల్లల్ని అభినందిస్తూ వీరు జాతీయ స్థాయి పోటీలకై కర్నూలు వెళతారని అక్కడ కూడా మంచి ప్రతిభను ప్రద ర్శించి భారత దేశపు డ్రీమ్ టీమ్‌లో ఉంటారని అభిలాషించారు.ఈ సంద ర్భంగా పిడి కామేశ్వరి మాట్లాడుతూ ఈ విద్యార్థులు అతి తక్కువ సమయంలోనే మంచి మెల కువలు సంపాదించుకుని రాష్ట్రస్థాయిలో కాంపిటీషన్ కి సెలెక్ట్ అయ్యారని ,వీరికి మరింత శిక్షణ ఇచ్చి జాతీయ స్థాయిలో రాణించే విధంగా కృషి చేస్తానని తెలి పారు. రాష్ట్రస్థాయిలో ఎంపిక కాబడిన, కీర్తన, సాయి ధాత్రి మాట్లాడుతూ తమకు ఎంతో ఓపికతో శిక్షణ అందించిన పిడిలకు, ఉపాధ్యా యులకు, ప్రధానోపాధ్యాయులు వారికి విద్యా కమిటీ వారికి తల్లిదండ్రులకు, ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఫస్ట్ అసిస్టెంట్ శివప్రసాద్, స్టాఫ్ సెక్రటరీనబి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు ప్రసాదం అందజేత

విశాలాంధ్ర- కొయ్యలగూడెం : అయ్యప్ప స్వామి దీక్ష తీసుకున్న స్వాములకు స్థానిక ఆరంజ్ ల్యాబ్ అధినేత దూలం రత్నజి, శ్రీమతి స్రవంతి దంపతుల ద్రవ్య సహాయంతో విభిన్న హారతుల పూజా కార్యక్రమాలు నిర్వహించి, తీర్థ ప్రసాదం కదంబం (సాంబార్ రైస్) ను వారి చిన్నారులు అభిరామ్, అఖిల కుమారి లతో కలిసి భక్తులకు వడ్డించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు సంకు కొండలరావు, గంటా శ్రీనివాస్, సతీష్, మదుతురు శ్రీను పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు, పంట నియంత్రణపై అవగాహన

విశాలాంధ్ర - దేవరపల్లి : దేవరపల్లి మండలం లోని గురువారం సంగాయిగూడెం గాంధీనగర్ గ్రామాల్లో నారుమడి యాజమాన్య పద్ధతులు, పంట నియంత్రణ పై సంగాయి గూడెం, గాంధీనగరం రైతులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. దినికి పొగాకు బోర్డు ప్రాంతీయ అధికారి జి. ఎల్. కె ప్రసాద్ మరియు దేవరపల్లి వేలం నిర్వాహణ అధికారి పి. హేమస్మిత, ఐ.టి.సి. ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, పి.ఎస్.ఎస్. ప్రతినిధి సీతారామ రాజు గౌతమ్ క్షేత్ర అధికారులు మరియు క్షేత్ర సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నారుమడిని వీక్షించి నారుమడి పెంపకం పె తెగుళ్ళు,పురుగు మందుల వాడకం గురించి సూచనలు పొగాకు బోర్డు నిబంధనలు ప్రకారం నారు అమ్మే విధానం గురించి వివరించారు. రిజిస్ట్రేషన్ పొందిన రైతులకు మాత్రమే నారు విక్రయించాలి అని సూచించారు. ప్రపంచ దేశాలలో పొగాకు ఉత్పత్తి 3762 మిలియన్ కిలోలు నుండి 4197 మిలియన్ కిలోలకు పెరిగిన కారణంగా, మరీ ముఖ్యంగా బ్రెజిల్, జింబాబ్వే మరియు చైనాలో అధిక పొగాకు ఉత్పత్తి కారణంగా, ప్రస్తుతం మన రైతులు పండించిన లోగ్రేడ్ పొగాకును మంచి దరలకు అమ్ముకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కావున ఈ సంవత్సరం రైతులు విధిగా పొగాకు పంట నియంత్రణ పాటించి. నాణ్యత పెంపుదలపై దృష్టి సారించవలెను. రైతులు తమకు కేటాయించిన పరిమాణంకు లోబడి మాత్రమే సాగు చేయవలసినదిగా సూచించారు

క్రీడా పోటీలకు భాష్యం స్కూల్ విద్యార్థులు

విశాలాంధ్ర-దేవరపల్లి : దేవరపల్లి ఏ ఎస్ ఎన్ జెడ్ పి హెచ్ స్కూల్ క్రీడా ప్రాంగణంలో జరిగిన మండల స్థాయి ఎస్ జి ఎఫ్ క్రీడా పోటీలలో భాష్యం స్కూల్ విద్యార్థులు కబడ్డీ, కోకో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, చెస్ వంటి పోటీలలో 49 మంది నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపి కయ్యారని భాష్యం స్కూల్ ప్రిన్సిపల్ పి పేరయ్య నాయుడు తెలిపారు. గెలు పొందిన విద్యార్థులను భాష్యం జోనలించార్జ్ వి ఆంజనేయులు, ఛాన్స్ ప్రిన్సిపల్ షేక్‌షబానా, వ్యాయామ ఉపాధ్యా యులు ఆర్ శృతి ఎస్ మంజు ఉపాధ్యా యులు అభినందించారు. చదువుతో పాటుగా క్రీడలకు సమప్రాదాన్యమిస్తూ విద్యార్థుల శారీరక మానసిక వికాసానికి కృషి చేస్తున్నామని భాష్యం స్కూల్ ప్రిన్సిపల్ పి పేరయ్య నాయుడు తెలిపారు.

రేపు డైల్ యువర్ డీఎం

- ఏపీఎస్ఆర్టీసీ డిపో మేనేజర్ కె.మాధవ

విశాలాంధ్ర - రాజానగరం : ఏపీఎస్ఆర్టీసీ ప్రయాణికులు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు, సమస్యలను పరిష్కరించేందుకు డైల్ యువర్ డి.ఎం అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టమని ఏపీఎస్ఆర్టీసీ రాజ మహేంద్రవరం డిపో మేనేజర్ కె.మాధవ అన్నారు. జిల్లా కేంద్రమైన రాజ మహేంద్రవరం నందు ఇందుకు సంబంధించిన పత్రిక ప్రకటనను గురు వారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 11 వ తేదీన శనివారం ఉదయం 11 గంటల నుండి 12 గంటల వరకు డైల్ యువర్ డి.ఎం ప్రోగ్రాం ఏర్పాటు చేశామన్నారు.ప్రయాణికుల సమస్యలను ఫోను ద్వారా స్వీకరించి దానికి పరిష్కార నిమిత్తం తగు చర్యలు తీసుకోవడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. బస్సు లో ప్రయాణం చేసే ప్రయాణికులు, విద్యార్థులు, ఇతర కార్యాలయాల్లో చేసే ఉద్యోగులు ఈ నంబర్ కి ఫోన్ చేసి వారి సమస్యలు తెలపవచ్చున్నారు. అటువంటి వారి వివరాలు గోప్యంగా ఉం టాయని చెప్పారు. ఫోన్ నంబర్ 9959225535 అని తెలిపారు.

మాజీ సర్పంచ్ అటికే కుటుంబాన్ని పరామర్శించిన వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరి బాబు

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : మండలం శరభవరం గ్రామ మాజీ సర్పంచ్ అటికే సత్యవతి మృతి ఆ కుటుంబానికి తీరని లోటు అని వైసీపీ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. గురువారం ఆమె స్వగృహం నందు ఆమె కుటుంబం సభ్యులను పరామర్శించారు. మాజీ సర్పంచ్ కుమారులను ఓదార్చారు. వారి కుటుంబానికి ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో రామిశెట్టి నాని, రామిశెట్టి దొరబాబు, అమరాధి కాశి, గువేరా, రంగనాథం అబ్బాయి, బర్రె రామకృష్ణ, సుగసాని సూర్య ప్రకాశ రావు, దూల్ల నాగ సూర్యం పాల్గొన్నారు.

ప్రజలకు మరింత అందుబాటులోకి రవాణా శాఖ ప్రాంతీయ కార్యాలయం

విశాలాంధ్ర - దేవరపల్లి : రవాణా శాఖ సేవలు ప్రజలకు మరింత అందుబాటులోకి తీసు కొని రావటానికి ప్రభుత్వం తీసుకున్న చర్యల్లో భాగంగా దేవరపల్లిలో రవాణా శాఖ ప్రాంతీయ కార్యాలయాన్ని ప్రారంభించినట్లు గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పేర్కొన్నారు దేవర పల్లిలో బుధవారం సాయంత్రం రవాణా శాఖ ప్రాం తీయ కార్యాలయాన్ని ఆయన ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు మాట్లాడుతూ కొవ్వూరులో 9 మండలాలకు చెందిన ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయం ఉండేద న్నారు. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లిలో ప్రజ లకు మరింత చెరువులో ఉండటానికి గోపాల పురం దేవరపల్లి నల్లజర్ల మండలాలకు సంబం ధిం చి ప్రాంతీయ కార్యాలయాన్ని దేవరపల్లిలో ఏర్పాటు చేయడం వలన మూడు మండలాల ప్రజలకు అం దుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ ప్రాంతీయ కార్యాలయంలో వాహనాల రిజిస్ట్రే షన్లు లైసెన్సులు ఇవ్వటం జరుగుతుందని ఎమ్మెల్యే మద్దిపాటి తెలిపారు గోపాలపురం నియోజకవర్గం నడిబొడ్డున గల దేవరపల్లిలో రవాణా శాఖ ప్రాం తీయ కార్యా లయం మంజూరి చేసిన రవాణా శాఖ మంత్రి కి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు కృతజ్ఞతలు తెలి పారు జిల్లా రవాణా శాఖ అధికారి ఆర్ సురేష్ మాట్లాడుతూ బుధవారం దేవరపల్లిలో అధికారి కంగా రవాణా శాఖ ప్రాం తీయ కార్యాలయం ప్రారంభమైందని తెలిపారు దేవరపల్లి నల్లజర్ల గోపాలపురం మండల ప్రజలు వినియోగించుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమం లో దేవరపల్లి రవాణా శాఖ ప్రాంతీయ అధికారి సిహెచ్ వెంకటరమణ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సిహెచ్ సంపత్ గోపాలపురం ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మా రాజు గోపాలపురం నియోజక వర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ డి సువర్ణ రాజు దేవర పల్లి మండల అధ్యక్షుడు అంద్రు అనిల్ నల్లజర్ల మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు తాతిన సత్య నారా యణ తెలుగుదేశం నాయకులు కొయ్య లమూడి చిన్న బాబు గన్నమని హరికృష్ణ ఉప్పులూరి రామారావు పెనుమత్స సుబ్బరాజు ముళ్ళపూడి దొరాజి చౌదరి పరిమి శ్రీరామకృష్ణ చిలక రాజేష్ అబ్బిన సురేంద్ర గద్దె రమాదేవి మింటిమి అమరా వతి జనసేన నాయకులు కంబాల సత్తిబాబు మాధ వరపు వెంకటే శ్వరావు పసుపులేటి శివ నాగ ప్రసాద్ సూరిశెట్టి బాలు నేతలు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో ఉచిత ఫిజియోథెరపీ శిబిరం

విశాలాంధ్ర - యానాం : యానాం వృద్ధాశ్రమంలో వృద్ధుల ఆరోగ్య సంరక్షణ కోసం ఆధునిక ఫిజియోథెరపీ చికిత్సా సేవలను అందించేందుకు "ఏబుల్ ఫిజి యోథెరపీ సెంటర్" వారి ఆధ్వర్యంలో ఉచిత ఫిజియోథెరపీ చికిత్సా శిబిరం ఏర్పాటు చేయబడింది. ఈ ఉచిత ఫిజియోథెరపీ చికిత్సా శిబిరాన్ని గురువారం ఉదయం పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి గొ మల్లాడి కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధుల ఆరోగ్య సంరక్షణలో ఫిజియోథెరపీ వంటి ఆధునిక చికిత్సా పద్ధతులు ఎంతో కీలకం. వృద్ధుల శారీరక, మానసిక ఆరోగ్యాభివృద్ధికి ఇలాంటి సేవలు ఎంతో ఉపయుక్తం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏబుల్ ఫిజియోథెరపీ సెంటర్ డా ఉదయ్ భాస్కర్ మరియు సిబ్బంది, వృద్ధాశ్రమ నిర్వాహకులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

చెకుముకి సైన్సు సంబరాల గోడపత్రిక ఆవిష్కరణ

విశాలాంధ్ర - యానాం : జన విజ్ఞాన వేదిక చెకుముకి సైన్సు సంబ రాలకు సంబంధించిన గోడ పత్రికను స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో డెలి గేట్ పంపన ప్రవీణ్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక జిల్లా పర్యావరణ కమిటీ కన్వీనర్, జువాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాంప్రసాద్ మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక 35 సంవత్సరాలుగా విద్యార్థుల్లో సైన్స్, చదువు పట్ల అసక్తి, శాస్త్రీయ దృక్పదంను పెంపొందించుటకు జన విజ్ఞాన వేదిక కృషి చేస్తుందని తెలిపారు. విజ్ఞానదాయకమైన విద్యార్థి చెకు ముకి సైన్సు మాసపత్రికను కూడా నడుపుతుందన్నారు. ప్రతి సంవత్సరం నాలుగు స్థాయిల్లో చెకుముకి సైన్సు సంబరాలు నిర్వహిస్తుందని తెలిపారు. యానాం కమిటీ అధ్యక్షులు ఆనాల వీర భద్రరావు మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో అక్టోబర్ 18, బ్లాక్ లెవెల్ నవంబర్ 1, జిల్లా స్థాయిలో నవంబర్ 23, రాష్ట్ర స్థాయిలో డిసెంబర్ 12,13,14 తేదీల్లో నిర్వహించబడుతుందని అన్నారు. గౌరవాధ్యక్షులు దాట్ల దేవదానంరాజు మాట్లాడుతూ చిన్నారుల సమ గ్రాభివృద్ధికి జన విజ్ఞాన వేదిక చేస్తున్న కృషికి చేయూత నిచ్చి విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, పాఠశాలల కరెస్పాండెంట్స్, ప్రిన్సిపాల్స్, విద్యార్థుల తల్లితండ్రులు విద్యార్థులను ప్రోత్సహించాలని ఆయన కోరారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెసల జయరామయ్య, కాశి కరుణ, శాస్త్రి, యానాం కార్యకర్త టీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'పొలంబడి' కార్యక్రమం

విశాలాంధ్ర - తాళ్లరేవు : కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం పి మల్లవరం దడాల సత్తికొండ పొలంలో 8వ వారం మండల వ్యవసాయ అధికారి ప్రశాంతి ఆధ్వర్యంలో జరిగింది. గురువారం రైతులు అందరిచేత పొలం పరిశీలన చేయించి పొలంలో ఉన్న మిత్రపురుగులు, శత్రు పురుగులు గుర్తిం చేలా చేశారు. దాని ప్రకారం పంట పొలంలో మందులు వాడాలా లేదా అవ గాహనా కల్పించారు. అనంతరం పొలంలో గుర్తించిన లోపాలు పై రైతులు చర్చించారు. ఈ కార్యక్రమంలో పొలంబడికి వచ్చిన రైతులు అందరికి కృషి అమృత్ గోవు ఆధారిత వ్యవసాయ క్షేత్ర రైతు ధూళిపూడి వెంకటరమణ మిలెట్స్‌తో తయారు చేసిన ఉప్మాను పెట్టారు. ఈ కార్యక్రమంలో రైతులు పంపన రామకృష్ణ, విళ్ళ సత్యనారాయణ, వుంగరాల వెంకటేశ్వరరావు, దడాల ప్రసాద్, జక్కుల మోహన్, బాబు, నాగార్జున, సాయి, రాము, రాజు, సతీష్, సూరిబాబు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది యంటి ధనలక్ష్మి, భవాని, వెంకట లక్ష్మి, అరుణ, వ్యవసాయ సిబ్బంది ప్రియాంక, అజయ్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : రైతులు తమ పొలంలో పురుగు మందులు పిచికారి చేసే విధా నంలో జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి జె అమృత అన్నారు. గురువారం మండలం లోని రాచపల్లి గ్రామ ంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వ హించి, ఏవో అమృత వ్యవసాయ క్షేత్రంలో రైతులకు పలు సూచనలు సలహాలు చేశారు. పురుగు మందుల వల్ల వచ్చే అనర్థాలు అధికంగా వాడితే జరిగే పరిణామా లను రైతులకు వివరిం చారు. అనంతరం పొలంబడి కిట్స్ రైతులకు అందజేసి పురుగుమందు పిచి కారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ, గ్రామ వ్యవసాయ సహాయకులు, పకృతి వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

దోమపోటు నివారణ సస్యరక్షణ చర్యలు

విశాలాంధ్ర - కరప : దోమపోటు నివారణ సస్యరక్షణ చర్యలపై కరప మండలం కొంగోడు గ్రామంలో పొలంబడి కార్యక్రమంలో రైతులకు సూచించడం జరిగిందని మండల వ్యవసాయ అధికారిని ఐ సత్య పేర్కొన్నారు. ఇండి గ్యాప్ పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించే రైతులకు సూచనలు సలహాలు అందించడం జరిగిందన్నారు. పైమెట్రోజైన్ 50డబ్ల్యూ 0.6ను దోమపోటు నివారణకు రైతులకు పిచికారి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బందారు శ్రీరాములు, విఏఏ సుల్తానా పాల్గొన్నారు.

పిఠాపురం మహారాజా విగ్రహానికి అభిషేకం

విశాలాంధ్ర - పిఠాపురం : పిఠాపురం మహారాజా కోటను కబ్జా చేసిన ఆదిత్య విద్యా సంస్థల అధినేత నల్లమిల్లి శేషారెడ్డి మహారాజా జయంతి రోజున మహారాజా విగ్రహానికి పూలమాలవేసి అపవిత్రపరి చారని, అందుకనే తాను మహారాజా విగ్రహాన్ని అభిషేకించి సంప్రోక్షించానని పిఠాపురం యువరాజా రావు రామరత్నా రావు పేర్కొన్నారు. పిఠాపురం కోట గుమ్మం సెంటర్లో ఉన్న పిఠాపురం మహారాజా విగ్రహానికి పాలతో, తులసి నీళ్ళతో యువరాజా రామరత్నారావు అభిషేకం చేసి, పూలమాలవేసి నివాళులర్పించారు. అనం తరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో పిఠాపురం మహారాజా ఆస్తిని దౌర్జన్యంగా కబ్జా చేసిన వ్యక్తి నుండి కాపాడి మహారాజా ఆశయాన్ని కాపాడాలని పిఠాపురం ఎమ్మెల్యే, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌ని వేడుకున్నారు. తన తదనంతరం మహారాజా ఆస్తి పిఠాపురం ప్రజలకు చెందేలా కూటమి ప్రభుత్వం, నాయకులు చర్యలు తీసుకోవాలని అభ్యర్థిస్తున్నారు.